జయజయ శంకర



హరహర శంకర

సంపుటి : 1 సంచిక : 8

శ్రీః

# కామకోటి వాణి

శ్రీ శుభకృత్ వైశాఖ మాసం - ఏప్రిల్ 2023



శ్రీ కంచికామకోటి పీఠం, కాంచీపురము



# విజయవాడ సిద్ధార్థా కాలేజీలో శ్రీ శంకర విజయేంద్ర స్వామివారి అనుగ్రహ భాషణం

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం । శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదాన్వహం ॥
దేవే దేహే చ దేశే చ భక్త్యారోగ్య సుఖప్రదమ్ । బుధ పామర సేవ్యం తం శ్రీజయేంద్రం నమామ్యహమ్ ॥
"వందే గురుపరంపరామ్"

ఈ కళారంగం మన జయేంద్రస్వామివారు అనేక పర్యాయాలు విచ్చేసి అందరిని అనుగ్రహ ఆశీస్సులతో ఆనందింపజేసి కటాక్షించిన వేదిక. ఇప్పుడు సుధానాగేశ్వరరావుగారు దంపతులు తరఫున ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. చాతుర్మాస్యం సందర్భంగా మేము హైదరాబాద్ నుండి కాకినాడకు వచ్చాము. అక్కడ చాతుర్మాస్యం ముగించుకొని గోదావరి జిల్లాలో కొన్ని పుణ్యక్షేత్రాలను, ఆ రామ క్షేత్రాలను, ఇంకా కొన్ని పల్లెటూర్లు, చూసుకుంటూ అద్వైతం సత్యం అనే విషయాన్ని ప్రబోధం చేసిన శంకరాచార్యుల గుర్తుగా ముక్కామల గ్రామంలో బ్రహ్మసూత్రం అనే ఫిలసాఫికల్ కార్యక్రమం జరిపించాము. మామూలుగా మన చంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వామివారి, జయేంద్ర సరస్వతీ స్వామివారి పూజా కార్యక్రమాలన్నీ ఇదివరకు కంచిలోనే జరిగేవి. ప్రప్రథమంగా ఆంధ్రదేశంలో (కంచికి బయట) చేయటం గోదావరి తీరంలోని గోష్పాద క్షేత్రంలో జరగటం అనేది ఈ సంవత్సరం విశేషం. పవిత్ర గోదావరి నదీ తీరం అయితే ప్రశస్తమని భావించి ఇక్కడ జరిపించాం. మరలా మమ్మల్ని కరుణించి మీరు వచ్చారు స్వామి అని ఊరివారు అన్నారు. గోదావరి పిలవడం వల్ల వచ్చాము అని చెప్పాము. అలా గోదావరి తీరంలో కార్యక్రమాలన్నీ మంచిగా జరిగాయి. విశాఖపట్టణం వెళ్ళే ముందు కొంత సమయం ఉంటే ఇక్కడకు రావటం జరిగింది. విశాఖపట్టణం వెళ్ళి తిరిగి వచ్చేస్తాము. విజయవాడలో పరిచయమైన రవిరాజుగారు ఇప్పుడు విశాఖపట్టణంలో ఉండటంతో అక్కడ శంకరమఠం కమిటీలో ప్రెసిడెంట్‌గా బాధ్యతలు తీసుకుని ఉంటున్నారు. కొన్నిరోజులు అక్కడ ఉందామనుకున్నాం కాని మహాశివరాత్రి వరకు విస్తారమైనది. అక్కడే రుద్రయాగం, చండీయాగం కూడా మంచి పర్ణశాలలో శంకరమఠంకు ఆనుకుని ఉండే గోశాలలో ఏర్పాటు చేశారు. చెన్నై, హైదరబాద్ నుండి వచ్చే భక్తులందరికీ అనుకూలంగా ఉండేది. అంతకుముందు బెర్హంపూర్, ఒరిస్సా అనుకున్నాము. కాని తరవాత కొవ్వూరు రావాలంటే విశాఖపట్టణమే సరైన చోటు అనుకున్నాము. సంక్రాంతి, శివరాత్రి అన్నింటికీ అనుకూలమని అనుకున్నాం. అక్కడి భక్తులు కూడా హోమాలు, వేదస్వస్తి, సంగీత కచేరీలు, ప్రవచనాలు, అన్నీ బాగా చేశారు.

శ్రీపంచమి రోజు అక్కడి పిల్లలందరినీ పిలిచి అక్షరాభ్యాసం చేయించారు. అందరికీ సరస్వతీ అమ్మవారి ఫోటో, నోటుబుక్కు, పెన్ను ఇచ్చారు. సామూహిక తులసిపూజ, ప్రతి మంగళవారం సాయంకాలం దీపపూజ ఆడవాళ్ళు అందరూ వచ్చి పాల్గొన్నారు. డాక్టర్స్ మీటింగ్, అడ్వకేట్స్ మీటింగ్, ఇంకా అనేక కార్యక్రమాలు అక్కడ కల్యాణమండపంలో జరిగాయి. స్వచ్ఛంద సంస్థలవాళ్ళు కూడ వచ్చి సభలు ఏర్పాటు చేశారు. విశాఖపట్టణం నుండి శ్రీకాకుళం వెళ్ళాము.

ఆ రోజుల్లో మన పరమాచార్యస్వామివారికి పరమేష్ఠిగురువు (గురువు – పరమగురువు – పరమేష్ఠిగురువు) 'సుదర్శన మహాదేవేంద్ర సరస్వతీ స్వామివారు, 1885వ సంవత్సరంలో విజయనగరం వచ్చారు. ఆ రోజుల్లో 1885–86 సుదర్శన మహాదేవేంద్ర సరస్వతీ స్వామివారు, తరువాత చంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వామివారు, వారి తరువాత మహా దేవేంద్ర సరస్వతీ స్వామివారు, ఆ తరువాత మన నడిచే దేవుడైన చంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వామివారు, అలా వారు ఇక్కడ పర్యటన చేసి పూరీ జగన్నాథ గుడి వరకు వెళ్ళివచ్చారు. అందుకని విజయనగరం, శ్రీకాకుళం, శ్రీకూర్మం దర్శనం (శనివారం రోజు), ఆదివారం రోజు సూర్యుడికి విశేషం కనుక భానుసప్తమి రోజు అరసవిల్లి దర్శనం, అవన్నీ చూసుకొని ఉత్తరాంధ్ర కూడా కొద్దిగా చూడాలి అని మన సంస్కృతిపరంగా, సంచారపరంగా కొంచెం దూరమైన ప్రదేశాలు కూడా మనం పర్యటించాలి అనే ఉద్దేశ్యంతో నర్సీపట్నం అనే ఒక ఊరికి వెళ్ళివచ్చాము. ఇంకా గోపాలపురం, ఇచ్ఛాపురం, ఇవన్నీ సందర్భాన్ని బట్టి వెళ్ళాలి. వికాసం వచ్చినప్పుడు 'సర్వతోముఖమైన వికాసం' కలగాలి. అన్ని చోట్లకి నీరు, నీడ, అందాలి. అస్సాంలో ఆ రోజుల్లోనే కంటి ఆసుపత్రి, బాలాజీ మందిర్, పూర్వ తిరుపతి బాలాజీ మందిర్, కట్టడం జరిగింది. ఈ రెండు కుంభాభిషేకాలు, స్వయంగా జయేంద్ర సరస్వతీ స్వామివారే అస్సాం వచ్చి చేశారు. ఇప్పుడు చాలా మంచిగ జరుగుతోంది. సుధానాగేశ్వర రావుగారు దంపతులు ఇదివరకు టి.టి.డిలో పనిచేశారు. కనుక ఆంధ్ర నుండి అస్సాంకు ప్రచారం కోసం సభ్యులుగా ఉండి, సేవ చేస్తున్నారు. అలాగే సిక్కింలో కూడా మంచి వేదపాఠశాల ఉంది. బెంగాల్‌లో జయంతిపూర్‌లో ఒక సంస్కృత వేదపాఠశాల ఉంది. వీటన్నింటిని కంచిపీఠం ద్వారా ప్రోత్సాహం చేస్తున్నాము.

భారతీయ సమైక్యత కోసం ఆదిశంకరాచార్యులు ఆ రోజు ఖాట్మండు, కాశీ, కామాఖ్య, కాలడి, కాంచి అన్నింటిని కలిపారు. అలా భారతీయ సమైక్యతకోసం, అద్వైతతత్త్వ ప్రచారంకోసం మంచి కార్యక్రమాలు, ఆ యా ప్రదేశాలకు ఏది అవసరమో దాన్ని బట్టి జరుగుతూ ఉంటుంది. ఏది ఎక్కడ అవసరమో చూసుకుంటూ, మనము అది చెయ్యాలి. ప్రభుత్వాలకి కొంచెం దూరంగా ఉండి, దేశానికి అవసరంగా ఉండే విషయల్లో ధార్మిక, అధ్యాత్మిక కార్యక్రమాలు, ఆశ్రమాలు, వ్యక్తిగతమైన దాతల ద్వారానే నడిపించాలి. మొత్తానికి ధర్మం కూడా ఈ దేశంలో ప్రచారంలో ఉండాలి. నిన్న



'కృష్ణ మండల వేద పరిషత్ ప్రవర్తక సభ'లో చెప్పాము. అంటే ముంగిస సగం బంగారం అయింది. మహాభారత కాలంలో అన్నదానం మంచిగా చేశారు. పేదవాళ్ళు, పసిపిల్లవాడు కూడా తన భాగమైన రొట్టెని వచ్చిన అతిథికి స్వతహాగా తను ఆకలిగా ఉన్నా, తనకి కష్టం ఉన్నా ముందుకు వచ్చి దానం చేశారు. అలాంటి దేశం ఈ భారతదేశం. పెద్ద వయస్సు వాళ్ళు, ధనవంతులు, చదువుకున్నవారు మాత్రమే కాదు భారతదేశంలో ఒక పసిపిల్లవాడు, ఒక కుటుంబసభ్యుడు, వచ్చిన అతిథికి ఎవరూ చెప్పకుండానే (కనకధారా స్తోత్రం ద్వారా శంకరాచార్యులవారు బంగారు వర్షం ఎలా కురిపించారో అలా) తనంత తానే ముందుకు వచ్చి ఆకలి తీర్చాడు. ఎందుకంటే ఇతరుల యొక్క కష్టాన్ని తెలుసుకునే మనస్తత్వం, తపన దేశంలో ప్రతి వ్యక్తికి ఉంటుంది. దయాపూరితమైన దేశం భారతదేశం. కొత్తగా ఎవరో వచ్చి సహాయం చేయండి, సేవ చేయండి అని నేర్పాల్సిన అవసరం ఈ దేశానికి ఎంతమాత్రమూ లేదు. కాని ఇప్పుడు అందరూ విడివిడిగా ఉంటున్నారు. కనుక మనుష్యుల్ని కలపవలసిన అవసరం ఉంది. అందరినీ ఒకే సంకల్పంతో మంచి చేయండని 'యువ జగస్త్వ దుర్లభః' అన్నారు.

కనెక్ట్ చేసేవాళ్ళు – కనెక్టివిటీ అన్నిట్లో ఉంటుంది. దీనిలో నుండి ఎనర్జీ వస్తుంది. కరెంట్ వస్తుంది. అంటారు. కాని మనుష్యులలో ధర్మ సంకల్పాలు అందరిలో కలిగించడం అంటే ధర్మసంకల్పం కలిగిన వారందరినీ ఒకే వేదికపైకి తీసుకురావాల్సి ఉంటుంది. అందుకే శంకరాచార్యుల యొక్క తత్వాన్ని ప్రచారం చేయడానికై దేశవ్యాప్తంగా కంచిపీఠం కార్యక్రమాలు విద్య, వైద్యం, వేదం అనే మూడు విషయాలలో జరుగుతుంటాయి. స్కూల్స్, కాలేజీలు, యూనివర్సిటీల ద్వారా విద్యారంగంలో ప్రగతిని తీసుకురావాలి. గుంటూరులో కూడా కంచి కామాక్షి కన్యక విద్యాలయ అని శంకుస్థాపన అయ్యింది. అది భవన నిర్మాణం అయిన తరువాత అమ్మాయిల కోసం సంగీతం, నృత్యం, హస్తకళ, కోలాటం ఇవన్నీ నేర్పిస్తూ సిబిఎస్‌సి సిలబస్‌తో స్కూల్ మొదలవుతోంది. ఈ స్కూల్ నిర్మాణానికి మాదాల సుధాకర్‌గారు 4 ఎకరాల భూమిని ఇచ్చారు. అలా విద్య, వైద్యం, కంటి ఆసుపత్రులు పీఠం తరఫున జరుగుతున్నాయి. – ఏప్రిల్ 7వ తారీకు శుక్రవారం హైదరాబాద్‌లో నార్సింగి అనే ప్రాంతంలో కంటి ఆసుపత్రి ప్రారంభమైంది. బెర్హంపూర్‌లో నిర్మాణం దశలో ఉంది. కాశీలో ఇప్పుడు భూమి పూజ జరిగింది. ఇంకా శంకర నేత్రాలయ బ్రాంచ్ కలకత్తాలో ఉంది. అస్సాంలో 'శంకర దేవ నేత్రాలయ' ఉంది. అలా దేశవ్యాప్తంగా వైద్యసేవలో ఒక విభాగంలో మనవాళ్ళు బాగా చేస్తున్నారు. ఇవే కాకుండా 'శంకర హిందూ మిషన్ హాస్పిటల్స్' అని అక్కడక్కడ ఉన్నాయి. ఇది వరకు రాజులు, మహారాజుల కాలంలో వేదానికి, శాస్త్రానికి, పురాణానికి, బుర్రకథలకి, అష్టావధానానికి ఇంకా మన లలితకళలకి తోరణం కట్టారు. ఇప్పుడు ఆ తోరణంలో మొదటి అక్షరం కొంచెం పక్కకి వచ్చేసింది. కనుక పరిస్థితి కొంచెం మారింది. దానితో చికిత్స అవసరమయింది. భారతీయులు అంటే వికాసం అనేది ధర్మంలో ఎప్పుడూ ఉంటుంది. ధర్మం అంటే ఏదో గంట కొట్టడం మాత్రమే కాదు. గంట కొట్టడంతో పాటు పంట, వంట, గంట అని చెప్తాం. అందుకని వేదవాఙ్మయం తెలుసుకుందాం. తపస్సనేది అనేక విధాలుగా ఉంటుంది. మంత్రజపం అనేది ఒక తపస్సు. వంట చేయడం అనేది కూడా ఒక అమంత్రకమైన తపస్సు. ఒక పూలమాల కట్టాలంటే దానిలో ఏకాగ్రత, భక్తి, వినమ్రత, కల్పన, మనోధర్మం ఉంటుంది. సాధన అనేది అనేక రూపాల్లో ఉంటుంది. మనదేశంలో అందరికి కూడా భగవద్భక్తి, ఈశ్వరానుగ్రహం కలగాలనే ఉద్దేశ్యంతో భగవంతుడు మనకి ఇచ్చిన సాఫ్ట్‌వేర్ సనాతనధర్మం. ఈ

సనాతనధర్మంలో రైతుకు, పనిచేస్తున్నవాళ్ళకు, పేదవాళ్ళకు, జమిందార్లకు అందరికీ పుణ్యం ఒకే స్థాయిలో ఉండాలి. అది చలంగా, చంచలంగా ఉండకుండా స్థిరంగా ఉండటానికి భగవంతుడు ఏర్పాటు చేశారు. ఆ వ్యవస్థని గుర్తు చేయడము, ధర్మప్రచారం ఎక్కడ చేయాలో అక్కడ పాఠశాలలు పెట్టించడం మన యొక్క ఉద్దేశ్యంగా ఉంటుంది. గ్యాప్ ఫిలప్ చేయడం, గ్యాప్ క్రియేట్ చేయటం మన ఉద్దేశ్యం కాదు. కాని దీనిలో విదేశీయులు వచ్చి గ్యాప్ క్రియేట్ చేశారు. గ్యాప్ ఉంది, అని చెప్పి చెప్పి ఇంకా పెద్దది చేశారు. అనేకత్వంలో ఏకత్వం తీసుకువచ్చేది ఎలా అని ఆలోచించారు. వ్యక్తిత్వాన్ని చెడగొట్టకుండా కర్తవ్యాన్ని తెలియచెప్పాలి. భాషాపరమైన, సమాజపరమైన, ప్రదేశపరమైన, ఇంకా వ్యాపారపరమైన వ్యక్తిత్వాలు చాలా ఉంటాయి. కృష్ణా వాళ్ళము, గోదావరి వాళ్ళము, రాయలసీమ వాళ్ళము అని చెప్తారు. ఇన్ని ఉన్నా, దాని మధ్యలో మనం భారతీయులం. సనాతన ధర్మానికి చెందిన వాళ్ళం. చివరగా మనం మానవులం. ఏ దేశ సిటిజన్ అయినా మనం మానవులం అనే విషయాన్ని శంకరాచార్యులు



స్తోత్రాలు, ప్రకరణాలు, భష్యాలు, ఉపదేశగ్రంథాల ద్వారా తెలియ చెప్పారు. భగవత్పాద సందేశాన్ని ప్రజల మధ్యలోనికి ఎలా తీసుకెళ్ళాలంటే – మూలానికి హాని కలిగించకూడదు. ఆధార పీఠానికి ఆటంకాలు లేకుండా ధర్మప్రచారం మంచిగ చేయడానికి

మనదేశంలో ఒక వ్యవస్థని ఏర్పాటు చేయాలి. ఆ వ్యవస్థ ఏర్పాటు చెయ్యడానికే పాఠశాలలు, ఆశ్రమాలు ఉన్నాయి. సంస్థ అనేది వ్యవస్థ కోసమే. అందుకని కొత్తగా మనం ఏదో మాస్‌ని ఎట్రాక్ట్ చేయడానికి చెప్పడం, లేదా మొబలైజేషన్ చేయడం ఉండకూడదు. అందరికీ శాంతి, సుఖం, నిర్మలమైన మనస్సు కావాలి. ఇలాంటివి చెయ్యడానికి మన దేశంలో అప్లయిడ్ సైన్స్‌కే ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్యూర్ సైన్స్‌ని కొందరే చేసే పరిస్థితి ఉంటుంది. లేదంటే ప్రభుత్వాలే చేయాల్సి వస్తుంది. పెద్ద కంపెనీల ఫౌండేషన్స్ ఉంటే వాళ్ళు సౌకర్యాలు ఏర్పాటు చేస్తారు. రైతుల కోసం సుధానాగేశ్వరరావు గారు దంపతులు ఇక్కడ అగ్రికల్చర్ ల్యాబ్ పెట్టారు. భారతీయులు చాలామంది విదేశాలకి వెళ్ళి ఫౌండేషన్స్ పెడుతున్నారు. వాళ్ళందరూ కూడ ఇటువైపు కొంత చూస్తే ఇక్కడ కూడా వికాసం శీఘ్రంగా, సమగ్రంగా జరుగుతుంది. అందుకని విదేశీయులు మనల్ని చూస్తున్నారని 1947 ముందు అనుకున్నారు. ఇప్పుడు భారతీయులే భారతాన్ని చూడాలి. వెళ్ళినవాళ్ళు అక్కడేదో చదువుకుందామని ఫీజు కడతారు. అక్కడ అవసరం ఉందో లేదో కాని శ్రమను అక్కడ ఇస్తారు. దేశంలో వారి అవసరం ఉంది. దాతలు ఇటువైపు చూసి భారతదేశంలో అభావం, అవసరం ఎక్కడ ఉందో, అక్కడ దానధర్మాలు చేస్తూ ఉండాలి. గ్రామంలో గుడి కట్టించడం గాని, గుడి కట్టించడం కన్నా గుడి జరగడానికి, చైతన్యవంతంగా ఉండటానికి, పూజలు, కచేరీలు, నామసంకీర్తనలు, భజనలు, నామజపం రాయడానికి తగిన వ్యవస్థ, ధ్యానం చేసుకోవడానికి మండపాలు, చిన్న చిన్న కార్యక్రమాలకి మండపాలు కాని, చిన్న పూలతోట కాని, మినీ తిరుపతిలాగా చెయ్యాలి. 'హర్ పంచాయత్ మే పండిట్ హోనా, హర్ మందిర్ తిరుపతి హోనా' ప్రతి గ్రామంలో కూడా ధర్మాన్ని చెప్పడానికి ఒక పండితుడు కావాలి. ధర్మాన్ని మార్చి చెప్పకుండా సరైన దారిని చూపించాలి. (మార్గం తెలియకుండా డెల్టా జిల్లాలకి వెళ్ళామనుకోండి అది తంజావూరు కావచ్చు, కృష్ణా, గోదావరి కావచ్చు, 'యానికానిచ పాపాని జన్మాంతర కృతానిచ' అని ప్రదక్షిణం అక్కడే చేస్తూ ఉండాల్సి వస్తుంది. రూట్ తెలియక అడిగితే ప్రక్కనే ఉందంటారు లేదా ఆ ప్రక్కన చూడమంటారు. ఒకే పేరుతో 3, 4 గ్రామాలుంటాయి.)

అలా కాకుండా ధర్మం విషయంలో మంచి చేయటానికి ధర్మ



ప్రచారం అవసరం. టెక్నాలజీలో ఈ దేశం ముందు ఉంది. అడ్మినిస్ట్రేషన్‌లో, ఆర్థికంగా స్థిరంగా ఉంటే మనం ప్రజలకి ఆత్మవిశ్వాసం కలిగించడానికి ఉంటుంది. కాని ఆత్మోన్నతి కలిగించడానికి మూలాధారం, స్వాధిష్ఠానం రెండూ కావాలి. మూలాధారం అంటే మూలమంత్రం, మూలదేవత, మూలమైన వేదాలు, మూలమైన భక్తి, మనకి ముఖ్యంగా ఉండాలి. మనకి 'బాస్' భగవంతుడు. అయితే బేస్ మాత్రం ధర్మం. ధర్మప్రచారం చెయ్యడానికి సమయం కావాలి. టెక్నాలజీ వచ్చి గంటలో చేసే పని అరగంటలో చేసేస్తోంది. ఇది వరకు కాలక్షేపం అంటే రావిచెట్టు కింద కూర్చుని 10ని॥ మాట్లాడుకునేవారు. (హనుమాన్ చౌదరి అని ఒకాయన వచ్చారు ఆయన టెక్నాలజీకి చెందినవారు. ఆ రోజుల్లో మేము గ్రామంలో చదువుకున్నాము. చదువు నేర్పించే ఆయన ఇంటికి కూరగాయలు తీసుకొనిపోయి ఇచ్చేవారము. అరుగు మీద కూర్చుని ఆయన పాఠాలు చెప్పేవారు అని చెప్పారు.) ఈ రోజు మనకే తెలియకుండా సమయాన్ని టెక్నాలజి తీసుకొని వెళ్ళిపోతోంది. అలా ఉన్నప్పుడు భారతీయతని కాపాడటానికి, సంస్కృత భాషని, తెలుగు వాఙ్మయాన్ని కాపాడటానికి నాన్ పొలిటికల్ లీడర్‌షిప్ కావాలి. పొలిటికల్ లీడర్‌షిప్ అనేది ప్రభుత్వాలకు సరిపోతుంది. కళ, సంస్కృతి, భాష, కుటుంబ వ్యవస్థ ఇవన్నీ కాపాడటానికి ఈ కళాపీఠం ఎలా పెట్టారో అలా పెద్ద పెద్ద విద్యా సంస్థలు కూడా కల్చర్‌ని ప్రొటెక్ట్ చేయడానికి, ప్రిసర్వ్ చేయడానికి ఇలాంటి ఒక వ్యవస్థ ఏర్పచి దానికి అన్ని సదుపాయాలు చేసి, ప్రభుత్వాలు సహకారం తీసుకోవాలి. ఒక కాలంలో సర్వమాన్యం నో టాక్స్ అన్నారు. ఇప్పుడు కొబ్బరికాయ కొట్టినా, కర్పూర హారతులు ఇచ్చినా కూడా టాక్స్. ప్రభుత్వాలు కూడా ఇలాంటి ధర్మ వ్యవస్థకి అనుకూలంగా ఉండి ప్రజలు కూడా సహకరిస్తే చాలా బాగా ఉపకరిస్తుంది.

విజయవాడకి ఇప్పుడు కృష్ణా మండల 'వేద విద్వత్ ప్రవర్తక సభ' వజ్రోత్సవం కోసం వచ్చాము. దీని తర్వాత చిన్నకంచి అనే ఊరు వెళ్ళి అక్కడ నుండి గుంటూరులో 3, 4 రోజులు ఉండి, 'సనాతన ధర్మ సేవా గ్రామము' అని ప్రకాశంజిల్లా లోని పొదిలి అనే గ్రామానికి వెళ్తున్నాము. ఆంధ్రదేశంలో సంస్కృతం ఎలా కాపాడగలమని ఆలోచించాలి. సంస్కృత భాష మనకి భారతదేశంలో కామన్ కనెక్టివిటీ లాంగ్వేజ్. ఆసేతుశీతాచలం సంస్కృతం లింక్ లాంగ్వేజ్ అవుతుంది. అంటే నదులని అనుసంధానం చేయాలంటారు కదా ! అలా మనుష్యులని భక్తిపరంగా కలపటానికి సంస్కృత భాషని సంరక్షణం చేయడానికి 'సనాతన ధర్మ సేవా గ్రామము' అని మొదలు పెట్టాము. పర్యావరణం, గోశాల, ఏర్పాటు చేసే ఒక ఉద్యమం జరుగుతోంది. తరువాత తిరుపతిలో అక్షయ తృతియ, శంకర జయంతి ఉత్సవం, జరుపుకోవాలి. ప్రచారం అనేది ఒక విషయాన్ని ఎలా మార్చేస్తుంది అనడానికి అక్షయ తృతియ ఒక ఉదాహరణ. ఆ రోజు దానాలిస్తే ఫలితం అధికం. స్పెల్లింగ్ మారిపోతే, మనం ఇంపోర్ట్ ని ఎక్స్‌పోర్ట్‌గా, ఎక్స్‌పోర్ట్‌ని ఇంపోర్ట్‌గా అర్థం చేసుకుంటే విషయం మారుతుంది. అక్షయతృతీయ అనేది మనం సత్కార్యం, సన్మానం, దానధర్మాలు చెయ్యడానికి గొప్పరోజు. అలాంటి అక్షయ తృతీయ రోజు తిరుపతిలో ఉంటాము. తరువాత జొన్నవాడ పెన్నానది ఒడ్డున ఉండే కామాక్షి గుడిలో అభిషేక కార్యక్రమాలు ఉన్నాయి. సమయాన్ని బట్టి అక్కడికి వెళ్తాం. తిరుపతిలోని గంగమ్మ గుడికి 5వ తారీకు పౌర్ణమి రోజు కుంభాభిషేకం జరుగుతుంది. మొత్తానికి మన ధర్మం పాటించడానికి గుళ్ళు ఉన్నాయి. కాని గుడితో పాటు విద్యావిధానంలో అనేక స్థాయిలలో పార్ట్‌టైమ్ కాని ఫుల్‌టైమ్ కాని ధర్మప్రచారం చేయాలి. వేరే చేస్తారు అనుకునే రోజులన్నీ మారిపోయాయి. ధర్మం మన కోసం అవసరం. ధర్మ ప్రచారం అనేది ప్రతి గ్రామంలో జరిగే విధంగా చూసుకోవాలి. లౌకికవిద్యలో పెద్ద సంస్థలు ఎప్పుడో ప్రారంభించినవి ఈ రోజు వటవృక్షంగా ఎదిగాయి. అలా ధర్మ ప్రచారానికి కూడా మంచి ఇన్‌స్టిట్యూషన్స్ వచ్చి భగవద్గీత, భజగోవిందం, వివేక

చూడామణి, సంగీతం, నాదోపాసన, తరంగాలు, నామసంకీర్తనల, ప్రచారం బాగా జరగాలి. లౌకిక విద్యలో కూడా హైయర్ ఎడ్యుకేషన్ ఇండియాలోనే చదివే మంచి సమయం రావాలి. నలంద విశ్వవిద్యాలయానికి విదేశాల విద్యార్థులు వచ్చారని చరిత్రల్లో చెబుతూ ఉంటాం. కాని వాస్తవంలో ఈ రోజు చూస్తే పి.హెచ్.డి కోసం వెళ్ళారు, ఎమ్.ఎస్ కోసం వెళ్ళారు, డిగ్రీ కోసం కూడా విదేశాల వెళ్తున్నారు. అంటే చక్రం వేరే దిక్కున వెళ్తోంది. అలా కాకుండా హైయర్ ఎడ్యుకేషన్ కూడా ఇక్కడే చేయొచ్చు అనే విషయాన్ని మనం తీసుకురావాలి. దానికి స్వదేశీ లిబరలైజేషన్ అని ప్రజల మనస్సులో కూడా మార్పు రావాలి. కాన్ఫిడెన్స్, క్వాలిటి రావాలి. ప్రభుత్వాలు సహకరించాలి. దేశంలో ఏదైనా ఇబ్బంది వస్తే విమానాలు పంపి, పదివేలు, ఇరవైవేలు మందిని సంరక్షణలోకి తీసుకొస్తాం. ఎక్కడో ఇరుక్కున్నారు, వారిని తీసుకొస్తాం. ఈ విషయం వేరు. మనదేశంలోనే విద్యను మంచి క్వాలిటీగా ఎంచుకొని ఎంత అవసరమో, అంత మాత్రమే విదేశానికి సంబంధం అనే నిర్ణయం తీసుకొని అక్కడికి వెళ్ళాలి. గ్రాడ్యుయేషన్ కోసమే మనం వెళ్తున్నప్పటికీ, ధార్మిక ఆలోచనలలో వెళ్తే కొంత వరకు మార్పు వస్తుంది. ఇక్కడ కూడా మంచి మంచి నాయకులు లేని కారణం చేత బ్రయిన్ డ్రెయిన్ అనేది జరుగుతోంది అని అబ్దుల్ కలాంగారు చెప్పారు. అలా కూడా ఒక గ్యాప్ వచ్చేస్తుంది. అర్బన్, రూరల్ రిలేషన్‌తో హైయర్ ఎడ్యుకేషన్ ఏర్పాటు చేయడం సమిష్టిగా గురించి ఆలోచించాలి. పది, ఇరవైమంది ఇలాంటి పెద్ద సంస్థలు నడిపేవాళ్ళు ఎలా స్కూలు, కాలేజీ గురించి ఆలోచించారో హైయర్ ఎడ్యుకేషన్ గురించి కూడా ఆలోచించాలి. సైన్స్ టెక్నాలజితో పాటు భక్తిభావాలు, కుటుంబ నమ్మకాలు, పరిరక్షించే విధంగా ప్రయత్నం చెయ్యాలి. ఎన్.ఆర్.ఐలు ఎవరుంటారో వారందరికీ కూడా ఆంధ్రదేశానికి వచ్చి పుణ్యక్షేత్రాలు సందర్శించే సౌకర్యాలు, పుస్తకాలు, గైడ్‌లు కూడా ఏర్పాటు చెయ్యాలి. హైదరాబాద్ వచ్చినప్పుడు, శ్రీశైలం, విజయవాడ కనకదుర్గ దర్శనం, ఇంకా ఏవైనా పుణ్యక్షేత్రాల దర్శనం కల్పించాలి. 10రోజులు వచ్చినా వారికి సమయం పూర్తిగా ఉపయోగించే విధంగా ఆంధ్రతో సత్సంబంధాలు పెరిగే విధంగా ప్రణాళిక చేసుకోవాలి. అమెరికాలో, విదేశాలలో ఎక్కువగా ఆంధ్రదేశం వాళ్ళున్నారు కనుక ఆంధ్రదేశంలో కల్చరల్లీ, ఫ్యామిలీవైజ్, వాళ్ళని కనెక్ట్ చేసే విధంగా ఇలాంటి సంస్థలు అష్యూరెన్స్ ఇవ్వాలి. మంచి పనులు చేస్తున్నారిక్కడ. విజ్ఞానంతోపాటు, ఆధునిక విద్యతో ఇలాంటి మంచి విషయాలను ఈ 18 సంస్థలు జరుపుతూ ప్రజాసేవ చేస్తూ ఉండాలి. ఇక్కడి ధన్వంతరి విగ్రహం స్వామివారు పెట్టించారు. మంచి ప్రసిద్ధమైన వైద్యసంస్థగా ఇది ఉంది. ఇంకొక సందర్భంలో ఇక్కడికి విచ్చేసి విద్యార్థులతో కూడా మాట్లాడి తెలుసుకోవాలి. 'సిద్ధార్థ' అంటే చెయ్యవలసిన పని చేసేవాళ్ళు, సిద్ధార్థం అంటే కృతకృత్యులు. 'సిద్ధార్థః స్వయం కృతకృత్యాః' అనే విధంగా మీ వర్చస్సుని, ధనాన్ని ఏకీకృతం చేసి, మంచి సభ్యులుగా, క్వాలిటీగా, క్వాంటిటీగా త్వరతో ప్రముఖ సంస్థగా ఏర్పాటు చేసుకోవాలి. ప్రస్తుతం విద్యారంగంలో, వైద్యరంగంలో రెండింటిలో కృషి చేస్తున్నారు. అలాగే ధర్మరంగంలో, సంస్కృతి రంగంలో మీ నైపుణ్యాన్ని, దాతృత్వాన్ని రెండింటినీ కూడా అందించి తద్వారా ధర్మం నిలబెట్టాలని మా కోరిక.

ధర్మం అనేది ఐహిక, ఆముష్మిక శ్రేయస్సు. కొందరు ధర్మానికి ఇక్కడ సంబంధం లేదు, ఎక్కడో శాటిలైట్ సంబంధం అనుకుంటారు. ధర్మం పారలౌకికం కాని ఐహికం కూడా ఉంది. ధర్మమంటే దౌర్జన్యం కాకుండా సౌజన్యం ఉండాలన్నది ముఖ్యం. పేదరికనిర్మూలన జరగాలన్నా, ప్రజల మధ్యలో అసూయ, ద్వేషం, మదమాత్సర్యాలు పెరగకుండా ఆపడానికి సమయం పడుతుంది. సాధన, తపస్సు వల్ల



మంచి శాసనం వలన వీలవుతుంది. ('జ్ఞానినౌ ఆచరితుం శక్యం సమ్యక్ రాజ్యాది లౌకికం' రాముల వారి యొక్క మామగారు జనకుడు. ఆయన మహాజ్ఞాని. ఆయన ఒకవైపు, ఇంకోవైపు దశరథుడు, వశిష్ఠులవారు కూడా జ్ఞానులే. రాములవారు ఎవరికి ఆజ్ఞా బద్ధులు? ఈ రోజుల్లో కొందరి విషయాలలో చూస్తూ ఉంటాం. ఎవరికి ఇబ్బంది లేకుండా 'వివాహశ్చ వివాదశ్చ సమయోవేవ శోభతే' అంటున్నారు. పై రెండు కుటుంబాలవాళ్ళు వేదాంతంలో, ఫిలాసఫిలో, సేవలో అనుకూలమైనవారు. జ్ఞానిగా ఉండేవాళ్ళు అందరికీ కూడా అనుకూలం చేస్తారనే మంచి విషయం చెబుతున్నారు.) అలా మంచి శాసనం, అనుశాసనం, పర్యావరణం దేశంలో మంచిగా ఉండాలి. ప్రజల



మధ్యలో మంచి సమైక్యత ఉండి తద్వారా అందరికీ మంచి జరిగేటట్లు మనదేశం బలంగా, ఆత్మబలంతో ఉండాలి. ఆధ్యాత్మిక బలంతో ఉండాలి. ప్రబలంగా ఉండాలి. దానికి అందరూ కూడా వారి వారి యోగ దానాన్ని చేసి 'శ్రేయో భూయాత్ సకల జనానాం' చెప్పుకుంటూ సేవ చేయాలి. సిద్ధార్థ అకాడమీ ధార్మిక రంగంలో కూడా తన వంతు సేవని అందిస్తూ విజయవాడ ప్రజానీకానికి, పరిసర ప్రజానీకానికి ఇంకా సేవలు చేయాలని కంచి కామాక్షి అమ్మవారిని ప్రార్థన చేస్తున్నాము.

**ఈ సందర్భంగా శ్రీస్వామివారు కొంతమంది భక్తులు అడిగిన సందేహాలకు గొప్ప అనుగ్రహంతో సందేహ నివృత్తి చేశారు.**

***భక్తుడు :*** ***చైతన్య మహాప్రభువు తన భక్తునితో నీకు మోక్షం ఒక్క నిమిషంలో ఇస్తాను అని చెప్పారుట. మోక్షం అంత సులువుగా వచ్చేదా ?***

**స్వామివారు :** ప్రోత్సాహం కోసం చెప్పిన మాట అయి వుంటుంది కాని, వేదాల్లో అర్థవాదాలు అని వుంటాయి. స్వర్గం కోసం దానిని చెయ్యాల్సి ఉంటుంది. అంటే ఆ మోక్ష మార్గాన్ని చూపించగలుగుతారు. మోక్షాన్ని అంత శీఘ్రంగా ఇవ్వటం అనేది సాధ్యం కాదు. మోక్ష మార్గం ఏది ? ఏ దారిలో వెళితే మోక్షం వస్తుంది ? అనే దానిని మోక్షప్రాప్తి క్రింద మనం అర్థం చేసుకొని వుండవచ్చు. మొత్తానికి దుర్మార్గ నివారణ ముఖ్యం. 'దుష్ట దూరా దురాచార శమనీ దోషవర్జితా' అని లలితా సహస్రనామంలో మనం చెబుతాం. దుష్టదూరా అంటే మోక్షమార్గానికి ఇబ్బంది కలిగించే విషయాన్ని దూరం పెట్టే శక్తి గురు అనుగ్రహానికి ఉంటుంది. దురాచార శమని అంటే పొల్యూషన్ వల్ల ఇంజిన్‌కూడా సరిగా పనిచేయదు. అందుకని దురాచారం, దోషాలు లేకుండా చేస్తుంది దుర్గ. దుఃఖ హంత్రి సుఖప్రద. సుఖప్రద అనేది కరక్టే. కానీ దుఃఖ హననం అయితేనే సుఖం వస్తుంది. అజ్ఞానం, అశ్రద్ధ, అహంకారం లేకుండా ఉంటేనే మోక్షం అనేది వస్తుంది. అది విశ్వాస జనకమైన మాట, అది సాధన వల్ల సాధ్యమౌతుంది. మోక్షమనేది సద్యద్ఫలం అనే విషయం నిజం కాదు. సరైన మార్గాన్ని గురువు చూపిస్తారు. వెంటనే మోక్షం రావటం అనేది శిష్యుని యొక్క సాధన బట్టి ఉంటుంది.


***మరొక భక్తుడు:*** ***సాధారణ జీవితం గడుపుతున్న మనుష్యులు వేదవాఙ్మయమ్ తెలియకపోయినా మోక్షం పొందవచ్చా ?***

**స్వామివారు :** అది మన సంస్కృతిని బట్టి ఉంటుంది. దానిని సత్యం వద ధర్మం చర అని ఉపనిషత్తులు చెబుతాయి. నిత్యకర్మానుష్ఠానం అనేది మనకి ముఖ్యం కనుక, కర్మ సిద్ధాంతాన్ని మనం

అంగీకరించిన వారము కనుక దీపం వెలిగించటము, అర్చన చెయ్యటము, ప్రాతఃస్నానము, సాత్త్వికమైన ఆహారము స్వీకరించటము, నామసంకీర్తనము నిత్యం చేయటము లాంటి నిత్యకర్మానుష్ఠానము చెయ్యాలి. ఇవేమీ మనం చెయ్యకుండా ఫలితం మాత్రం మనకు రావాలి అంటే ఎలా ? ఫలితం కోరకుండా పని చేయండి అని భగవద్గీత చెప్తోంది. 'కర్మణ్యేవాధికారస్తే మాఫలేషు కదాచన' అందుకని ప్రహ్లాదుడు, ధ్రువుడు లాగా తపస్సు చేయక పోయినా యథాశక్తి మనం నిత్యకర్మానుష్ఠానం చేయడం చాలా అవసరం. ఈ కలియుగంలో 'స్వల్పమప్యస్య ధర్మస్యత్రాయతే మహత్ భూయాత్' కొద్దిగా చేసినా పెద్ద ఆపదల నుంచి మనం నివృత్తి పొందుతాము. అందుకని తప్పని సరిగా ధర్మాన్ని ఆచరించాలి. చిన్నగా చేసినా దానికి మహత్తరమైన ఫలితాలు ఉంటాయి. 'కలౌ భక్తిరేవ గరీయసి' అంటే కొద్దిగా అనుష్ఠానాలు చేసినా కోటిగుణితమైన ఫలితాలు పొందే అవకాశం ఉంది. అందుకని దురాలోచన లేకుండా సత్సంకల్పంతో నియమిత అనుష్ఠానమైనా చేసి పుణ్యం పొందే అవకాశం మనకు కలియుగంలో ఉంటుంది. అలా మంచి సంకల్పాలు వస్తాయి. ఎవరికీ హాని కలిగించ కుండా, ఎవరితో ద్వేషం లేకుండా, ఇంకెవరో కష్టపడాలి అని మనం కోరుకోకుండా ఉంటే మనకు మంచి స్వయంగా స్వతహాగా వస్తుంది.

**మరొక భక్తుడు :** *భగవంతుని అనుగ్రహం గొప్పదా ? గ్రహాల ప్రభావం గొప్పదా ?*

**స్వామివారు :** రెండూ ముఖ్యమైనవే. గోవుకి చారం (గ్రాసం) ఇవ్వడం ముఖ్యమూ, గోచారం కూడా ముఖ్యము. విధి సుకృత దుష్కృత ప్రభావము లేకపోతే నలుడైనా, రాముడైనా, ధర్మరాజైనా కష్టపడేవారు కాదు. గ్రహప్రభావం ఉంటుంది. మన నిత్యకర్మానుష్ఠానం మరియు భక్తి ద్వారా అది తక్కువ అవుతుంది. ప్రశమనం అవుతుంది. మహాబంధ నుంచి మనకు నివృత్తి కలిగిస్తుంది. అందుకని భక్తితో కర్మానుష్ఠానం మనం చేసినప్పుడు ఆ గ్రహం యొక్క ఫలితాలు, ప్రభావం తక్కువగా ఉంటుంది. శాస్త్రంలో కూడా తారతమ్యం మనం చెప్పలేము అంటారు. అంటే ఒక ఎఫెక్ట్ వచ్చింది, ఫలానా ఆపద వచ్చింది కాని తలకాయతో పోయింది. అంటారు. మనకు వచ్చిన ఆపదలు తక్కువ కావడమో లేదా దాని గురించి ఒక అవగాహన రావడమో జరుగుతుంది. భద్రత అనేది నిత్యకర్మానుష్ఠానం ద్వారా కలుగుతుంది. భక్తితో మనం ఉండటం కూడా చాలా ముఖ్యం. భక్తి అనేది నవగ్రహాల ద్వారా వచ్చే కష్టాలని తక్కువ చేస్తుంది. మనకు ధైర్యాన్ని కలిగించి కవచాన్ని ఇస్తుంది. జయేంద్ర సరస్వతీ స్వామివారు చెప్పేది ఏమిటంటే వర్షం వస్తుంది కాని ఆ వర్షం యొక్క బాధ లేకుండా



రెయిన్ కోట్ వేసుకుంటే ఎలా కొంతవరకు ప్రయోజనమో అదే విధంగా కష్టాలు ఉంటాయి, భక్తి ద్వారా వాటి నుండి నివృత్తి కలుగుతుంది.

**మరొక భక్తుడు :** ***ప్రదక్షిణం చేసేటప్పుడు పాపోహం పాపకర్మాహం పాపాత్మా పాప సంభవః అని మంత్రం చదువుతాం. అది శాస్త్రీయమా ? 'ప్రణంతుం స్తోతుంవా కథమకృత పుణ్యః ప్రభవతి' అని ఆదిశంకరుల వారి సౌందర్యలహరిలో ఉంది. దయచేసి ఈ సంశయాన్ని నివారించండి.***



**స్వామివారు :** 'ప్రణంతుం స్తోతుంవా కథమకృత పుణ్యః ప్రభవతి' అని నమస్కారం చేస్తే, స్తోత్రం చేసిన పుణ్యం వస్తుంది. కానీ ఆ నమస్కారం చేయటానికి, పుణ్యం చేయటానికి కూడా కొంత పుణ్యం అవసరం. అదే శంకర భగవత్పాదులవారు చెప్పే తాత్పర్యము. సుకృతము ఉభయ సుకృత దుష్కృతి. సుకృతము అనేది మనం ఎప్పుడూ సంపాదిస్తూ ఉండాలి. ప్రదక్షిణము గురించి అడిగారు. ప్రదక్షిణము అనేది గొప్ప విషయము. మనం పురాణాల్లో వింటూ ఉంటాము. విఘ్నేశ్వరుడు తన తల్లిదండ్రులకి ప్రదక్షిణ చేసి మామిడిపండు తీసుకున్నారని. ఆ ప్రదక్షిణ యొక్క మహాత్మ్యము శంకరాచార్యులవారు 'పదే పదే సర్వ తమో నికృంతనం, పదే పదే సర్వ శుభ ప్రదాయకం, ప్రదక్షిణం భక్తి యుతేన చేతసా, కరోమి మృత్యుంజయ రక్ష రక్షమాం' అని చెప్పారు. మనం ప్రదక్షిణం చేసేటప్పుడు ఒక్కొక్క అడుగు పడుతున్నప్పుడు మన అక్కౌంట్‌లో ఉండే దోషాలు, పాపాలు తగ్గిపోతూ ఉంటాయి. ఒక్కో అడుగు వేస్తున్నప్పుడు పుణ్యాలు మనకి వస్తూ ఉంటాయి.

'పదే పదే సర్వ తమో నికృంతనం' తమస్సు, అజ్ఞానం, అంధకారం, అశ్రద్ధ ఇవన్నీ పోతాయి. 'పదే పదే సర్వ శుభప్రదాయకం' అలా ఒక్కో అడుగు వేస్తూ (అడుగు ప్రదక్షిణం) కంచిలో అధిష్టానం దగ్గర ప్రదక్షిణ చేస్తారు. అధిష్టానం దగ్గర ప్రదక్షిణ చేయడం అనేది గొప్ప విషయంగా భావిస్తారు. 'నదీ తీరే శతగుణం' కృష్ణా, గోదావరీ తీరంలో జపం చేశామంటే 100 రెట్లు ఎక్కువగా ఫలితం వస్తుంది. 'సముద్ర తీరే కోటీశ్చ' సముద్రతీరంలో చేస్తే కోటి రెట్లు ఎక్కువ ఫలితం వస్తుంది. 'సిద్ధి స్థానేషు అనంతశ్చ' మన స్వామివారి అధిష్టానం లాంటి చోటులో మనం ప్రదక్షిణ కానీ జపం కానీ చేస్తే అనంతమైన పుణ్యం వస్తుంది. అందుకని ప్రదక్షిణం అనేది ముఖ్యము. మన కంచి మహాస్వామివారు ఆవుకు దూడ కలిగేటప్పుడు ద్విముఖంగా ఉండేటప్పుడు తల్లి ముఖము ఇటు దూడ ముఖము ఒక్కసారి కనిపిస్తున్నప్పుడు ప్రదక్షిణ చేసేవారు. (అది మనము కూడా చూశాము. ఆయనకి 94 వయస్సులో ఆ సమయంలో అప్పుడు శిష్యులు వచ్చి చెబుతారు, స్వామి ఇంకా 5, 10 నిమిషాల్లో ప్రసవం ఉంటుంది అని, అప్పుడు వారు వచ్చి కూచుంటారు. కూర్చుని శబ్దం లేకుండా అంటే కాచుకొని ఉంటారు. అంటే ఎవరి దర్శనానికోసం ప్రజలు కాచుకొని ఉంటారో ఆ స్వామి ఈ ప్రసూతి సమయంలో కాచుకొని ఉండి, అప్పట్లో పాత గోశాల ఉండేది, అక్కడ చోటు కూడా తక్కువ. గోవుకు ఇబ్బంది కలగకుండా, పెద్ద శబ్దము చేయకుండా వారు దానికి ప్రదక్షిణ చేసి హారతి ఇచ్చేవారు.) అందుకని ప్రదక్షిణ అనేది గొప్ప

విషయం. అందుకే మనవాళ్ళు 'గిరి ప్రదక్షిణం' అనేది బాగా చేస్తున్నారు. 'గోవర్ధన పరిక్రమణ' అని సాష్టాంగ ప్రణామాలు చేస్తూ కూడా ప్రదక్షిణ చేస్తారు. అది మేము మధుర, బృందావనంలో చూశాము. అక్కడ భక్తులు సాష్టాంగం చేస్తారు. అలా 14కిలో మీటర్లు చేస్తారు. అరుణాచలం కంటే ఇది విస్తీర్ణమైనది. అలా ఈ దేశంలో ప్రదక్షిణం అనేది గొప్ప విషయం. అది మనం చెయ్యాలి. ఏదైతే శ్లోకం చదువుతుంటారో అది శాస్త్రీయమైనదే.


***మరొక భక్తుడు : భక్తి కన్నా సేవ గొప్పదా ? సేవ కన్నా భక్తి గొప్పదా ?***

**స్వామివారు :** భక్తి కారణం చేతనే సేవ చేస్తారు. భక్తి లేకపోతే సేవ ఎందుకు చేస్తారు. ఏదో ఒక విషయముపై భక్తి ఉండాలి. భగవంతుని పట్ల భక్తి ఉండాలి. లేదంటే విషయము పైన భక్తి ఉండాలి. గోసంరక్షణం మంచిది. చలివేంద్రం పెట్టటం మంచిది. ఆవుకు పచ్చికలు ఇవ్వటం మంచిది. శంకరాచార్యులు చెబుతారు 'హరితతృణ పూర్ణపాణిం ఉపలబ్య సంప్రత్ యది ముఖీ భవంతి దండోద్యతకరం ప్రతి పలాయంతి' ఆవులకి పచ్చగడ్డి చూపిస్తే దగ్గరకు వస్తాయి, అదే చేతిలో కర్ర పట్టుకుంటే దూరం వెళ్ళిపోతాయి. అందుకని భక్తి ఉంటేనే సేవాభావం అనేది వస్తుంది. అహంభావం అనేది పోతుంది. అహంభావం పోయినప్పుడే సేవాభావం వస్తుంది. ఒకదానికొకటి సంబంధం ఉన్న విషయాలు కాబట్టి భక్తితో సేవ చేయాలి. సేవా కార్యక్రమాలు చేసేటప్పుడు భక్తి ఉంటేనే అవి పూర్ణ ఫలితాన్ని ఇస్తాయి.

***మరొక భక్తుడు : విద్యారంగంలో అధ్యాత్మిక, ధార్మిక పాఠ్యాంశాల ద్వారా మార్పు రావాలంటే ఎలా ?***

**స్వామివారు :** ఇప్పుడు ఉండే పరిస్థితులలో ఆధ్యాత్మికం కుదరకపోయినా ధార్మికం కొంత వరకు కుదురుతుంది. ధార్మికం అనేది Genaral Principles. (T.N.P మహాదేవన్ వ్రాసిన ఒక పుస్తకం తెచ్చినాము.) అది ఏ దేశానికి చెందినవారైనా Genaral Principles అని కొన్ని వుంటాయి. ఇప్పుడు ఇక్కడకు వచ్చే ముందు కొంతమంది విదేశీయులతో మాట్లాడటం జరిగింది. అలా ఏ దేశానికి చెందినవారైనా సామాన్యధర్మం అనేది ఒకటి ఉంటుంది. సామాన్య ధర్మంను సమానత్వం, స్వాతంత్ర్యం,





ఆధునికం, progress లాంటివి చెప్పి దూరం పెట్టేస్తున్నాం. నిజంగా progress అనేది కావాలంటే ధార్మికమైన ఆలోచనలు ఉంటేనే side effects లేని progress అనేది ఉంటుంది.

**దేశంలో నిర్ణయాల గురించి చెబుతూ :** 'ఆద్యంతికాసిద్ధి విలంబసిద్ధ్యోః కార్యస్యసిద్ధిః ద్వివిధాభవతి' పని చేసిన వెంటనే పని ఫలితాలు వచ్చేది ఆద్యంతికా సిద్ధి. విలంబసిద్ధి ఇది ఆలోచన చేసి తద్వారా చేసే పని. అందరికీ మంచి జరుగుతుందా ? ఎవరికైనా ఇబ్బంది అవుతుందా ? అని ఆలోచన చేసి పని చేసేది భారతీయ ఆలోచనా విధానం. అందుకని విలంబసిద్ధి అయినా మనదేశంలో ధార్మికమైన విషయాలని పాఠ్యక్రమములో పెట్టటం అనేది చాలా అవసరము. వికాసము ధర్మంతో కూడిన వికాసాన్నే మనం వికాసంగా తీసుకోవాలి. ఆధ్యాత్మిక విషయాలని గుడిలో, మఠంలో నేర్పించాలి. అనుష్ఠానాలు, ధ్యానాలు ఇవన్నీ గుడిలో పెట్టాలి. ధార్మిక విషయాలు, Genaral Principlesని Schools, Colleges, విశ్వవిద్యాలయాలలో నేర్పించాలి.

**మరొక భక్తుడు :** ***తంజావూరు స్వర్ణ కామాక్షి గురించి చెప్పవలసినదిగా ప్రార్థన***

**స్వామివారు :** తంజావూరు కామాక్షిని బ్రహ్మదేవుడు పూజించారు. కామాక్షి అమ్మవార్లు ఐదుగురు. మొదటది బిలాకాశ కామాక్షి అని పేరు. సూక్ష్మరూపంలో కంచి కామాక్షి గుడిలో ద్వార రూపంలో ఉంటారు. అక్కడ సంవత్సరానికి ఒక్కసారి పాలతో అభిషేకం జరుగుతుంది. అమ్మవారు ఏ రోజు ఉద్భవం అయినారో ఆ రోజు జరుగుతుంది. కార్తీకమాసానికి ముందు పుబ్బ నక్షత్రంలో అభిషేకం జరుగుతుంది. రెండవ కామాక్షి తపస్ కామాక్షి, ఈమె పంచాగ్నిలో తపస్సు చేసే కామాక్షి. మూడవది మూలస్థాన కామాక్షి. ఎక్కడ మనం అభిషేకాదులు ప్రతిరోజూ చేయిస్తున్నామో గర్భగుడిలో ఉండే మూలవిరాట్ మూడవ కామాక్షి. నాలుగవ కామాక్షి ఉత్సవ కామాక్షి. ఉత్సవాల సమయంలో ఊరేగింపులలో ప్రజలను అనుగ్రహించే మాత ఆమె. అయిదవ కామాక్షి బంగారు కామాక్షి. చరిత్ర కారణాల చేత ఆమెను తంజావూరు తరలించవలసి వచ్చింది. ఇదివరకు కంచిలో ఉండేవారు. ఆమె బ్రహ్మదేవుని చేత పూజించబడిన అమ్మవారు బంగారు కామాక్షి, స్వర్ణకామాక్షి అంటారు. ఈ ఐదు కామాక్షి మూర్తులను దర్శించుకోవటం ముఖ్యమైన విషయం.


**మరొక భక్తుడు:** ***ఆడపిల్లను కన్యాదానం చేసిన తల్లిదండ్రులకు కొడుకులు లేనట్లయితే ఆ కన్యాదానం కొడుకులను పొందినదానితో సమానం అవుతుందా? పుత్ర సంతానం లేనివారు, కన్యాదానం చేస్తే పున్నామనరకం నుండి వారు తరిస్తారా? లేక పుత్రుడే ఉండాలా? ఆడపిల్లలు మాత్రమే పుట్టినా ఫరవాలేదా? పురుష సంతానం తప్పనిసరి అని శాస్త్రంలో ఉన్నదా?***

**స్వామివారు:** అది సమయంతో మారతాయండి ! సమయం ఒకటైతే శాస్త్రమనేది మరొకటి. ఇది వరకు పార్వతీ కల్యాణానికి శివుడే కదా సప్తఋషులను పంపించారు. అందుకని పురాణకాలాన్ని ఇప్పుడు మరలా తీసుకువస్తున్నారు. (నవ్వుతూ) అంటే యాభై సంవత్సరాల ముందు ఆడపిల్ల తల్లిదండ్రులు వరుని కోసం వెతికేవారు. పరమేశ్వరుడు పార్వతి కోసం సప్తఋషులు, అరుంధతిని పంపారు. అలాంటి పరిస్థితులు ఇప్పుడు ఉన్నాయి. 'స్త్రీ కుమారిత్య నాస్తేషా వర్త్మ్య విహితం సతా' ఆడవారనేది కాదు, మగవారనేది కాదు. శాస్త్రం ప్రకారం ఇప్పుడు మన మఠంలో శుక్రవారంనాడు, మంగళవారంనాడు వేదపండితుల కన్నా ముందుగా సువాసినులకే తీర్థం ఇవ్వటం జరుగుతుంది. దసరా నవరాత్రి సమయంలో మన పరమాచార్యులవారు స్వయంగా చంద్రమౌళీశ్వరపూజ తరువాత సువాసిని పూజ చేసేవారు.

అందువలన ఆడవారు, మగవారు అనే విషయం ముఖ్యంగా చూడకూడదు. Situation, Market అనేది ముఖ్యం కాదు. ఇది వరకు మగపిల్లలకు Demand. ఇప్పుడు ఆడపిల్లలకు. ఇలాంటి Market View దీంట్లో ఉండకూడదు. కేవలం ఆడపిల్లల సంతానం మాత్రమే ఉన్నవారికి కూడా దౌహిత్రుని ద్వారా మంచి కలుగుతుంది. దౌహిత్రుడు పుత్ర సమానం. Natural choiceగా దౌహిత్రుని గురించి శాస్త్రంలో చెప్పబడింది. ఆడపిల్లా, మగపిల్లవాడా అనేది నిర్ణయించుకోకుండా దానిని సృష్టికి వదిలేయాలి. వీళ్ళు ఆపటమో, తపన పడటమో రెండూ అవసరము లేదు. ఎవరైనా సరే వారిని ధార్మికంగా పెంచాలి అనే సంకల్పం ఉండాలి. ఆడపిల్ల తల్లిదండ్రులకు మాత్రమే కన్యాదానఫలం, కన్యాదాన అవకాశం ఉంది కదా ! కొంతమంది కేవల మగసంతానం కలిగినవారు తమకు కన్యాదానం చేసే అదృష్టం లేదు అని బాధపడటం మనం చూస్తూ ఉంటాం. 'కోటికన్యామహాదానం ఏకబిల్వం శివార్పణం' (కోటికన్యకాదానం అనే ఇంటిపేరు కూడా కంచి పక్కన ఉంది.) కేవలం మగపిల్లలు సంతానంగా ఉన్నవారు కన్యాదానం చేసిన ఫలం మనకు ఎలా అనుకుంటారు. కాబట్టి మన ఆలోచనలో అందరినీ కూడా మంచిగా, ప్రేమగా చూసుకునే విధానం ఏర్పడాలి.

'అశోచ్యాహి పితుః కన్యా సద్భర్త్రే ప్రతిపాదిత' కొబ్బరికాయ దానం, గోదానం ఇట్లా అన్ని దానాలు చేస్తారు. అప్పుడు సంప్రతతే నమమ అంటారు. కానీ కన్యాదాన విషయంలో ఇస్తాను అని అంతవరకే చెబుతారు. నమమ అని చెప్పరు. అంటే ఇచ్చిన తరువాత కూడా వీరికి ఉండే ప్రేమ, అనురాగ సంబంధం అలాగే ఉంటుంది. మంచి భర్తగా ఉండబోయే వానికి కన్యాదానం చేస్తే తల్లిదండ్రులకు దుఃఖం అనేది ఉండదు అని శాస్త్రవాక్యం.

కన్యాదానం అనేది ఉత్తమమైన దానం. అది ఉత్తమ పాత్రత కలిగిన వానికి ఇవ్వాలి. బంగారం కూడా గొప్పదే కానీ దానిని ఎవరి చేతికి ఇస్తాము అనేది కూడా ముఖ్యము. ఇవ్వటము అనేది కాదు ఎవరికి ఇస్తున్నాము అనేది చాలా ముఖ్యము. ఇటువంటి గొప్పదానాన్ని ఇవ్వగలిగే అవకాశాన్ని తల్లిదండ్రులకు పిల్లలు ఇవ్వాలి(నవ్వుతూ). వీళ్ళకి పుణ్యం రావాలంటే యువత సహకరించాలి. దానివలన తల్లిదండ్రులకు పుణ్యం వస్తుంది. వివాహ సంకల్పంలో కూడా మంత్రాలు ఏమి చెబుతాయంటే కన్యాదానం చేసినవారికి 'కన్యాం కనకసంపన్నాం దాస్యాం కనకాభరణ భూషితాం దాస్యామి విష్ణవే తుభ్యం బ్రహ్మలోక చకీఋషయః' ఈ ధర్మ వైశిష్ట్యాన్ని యువత కూడా తెలుసుకోవాలి. ఒకసారి కంచిలో మూడు కార్యక్రమాలు చేశారు. అవి సామూహిక వివాహ కార్యక్రమాలు. ఒకటి ఏకామ్రేశ్వరస్వామి గుడిలో, మరొకటి కచ్ఛపేశ్వరస్వామి గుడిలో, మూడవది కామాక్షి అమ్మవారి కళ్యాణమండపంలో. ఇదంతా 1980 సం॥లో జరిగింది. దానికి మహాస్వామివారు వచ్చి ఆశీర్వచనం కూడా ఇచ్చారు. సమిష్టిగా నిరాడంబర వివాహాలు. ఆ రోజుల్లో కన్యాదానం ట్రస్ట్ అని మంగళసూత్రాలు ఉచితంగా ఇవ్వటం, ధనసహాయం లాంటివి చేసేవారు. (పది సంవత్సరాల క్రితం ఆడవారి సంఖ్య పురుషులతో సమానంగా ఉండాలని జయేంద్ర సరస్వతీ స్వామివారు ఢిల్లీలో పంజాబ్ వారికి ఇచ్చారు. అలా ఒక ఇరవై కుటుంబాల కోసము ప్రకాశ్ సింఘాల్‌గారి కోడలు కార్యక్రమం మొదలు పెట్టింది. అక్కడికి జయేంద్ర సరస్వతీ స్వామివారు వెళ్ళారు.) అందుకని ధర్మంలో మగవారు, ఆడవారు అనేది కాదు. అనుష్ఠానంలో మగవారి అనుష్ఠానం,



ఆడవారి అనుష్ఠానం అని ఉంటుంది కానీ అభిమానంలో తేడా లేదు. కంచి కామాక్షి కల్యాణమండపంలో మన జయేంద్ర సరస్వతీ స్వామివారి షష్టిపూర్తి సందర్భంగా అరవైమంది దంపతులకు పెళ్ళిళ్ళు Rotary Club వారితో కలుపుకొని జరిపించినారు.

***మరొక భక్తుడు : సనాతనధర్మం మనదేశంలో ఎప్పటికి నిలిచి ఉండే మార్గం చెప్పండి అని ప్రార్థిస్తున్నాము.***

**స్వామివారు :** మన ఇంటిలో మనం నిద్రపోవాలి. మన ఇంటిలోకి మంచి గాలి రావాలి అనుకుంటాము. అది మంచిదే. పక్క ఇల్లు, ఎదురు ఇల్లు కూడా మంచిగా ఉంటేనే మన ఇంట్లో మనకు నిద్ర అనేది సాధ్యమౌతుంది. అందుకని సామాన్యధర్మం అనేది విశ్వవ్యాప్తంగా ఉండాలి. దానికి అందరూ కృషి చేయాలి. అన్ని దేశాల ప్రజలూ సామాన్య ధర్మాన్ని పాటించాలి. గాలిని గోడ కట్టి ఆపలేము. ధర్మం ప్రజలకు ముఖ్యమనే విషయాన్ని పాలకులు గ్రహించాలి. సనాతనధర్మాన్ని పటిష్ఠం చెయ్యటానికి, ధనము, చట్టము, కార్యకర్తలు, పాఠ్యక్రమము అన్నీ మనకి అనుకూలంగా ఉంటేనే అది సాధ్యమౌతుంది. ఈ దేశం యొక్క సంరక్షణంలో కూడా సనాతనధర్మం అనేది ఉండటం అవసరం. ధర్మం కోసం ఒక హిందువుగా, సనాతనధర్మ రక్షణ కోరుకోవటం సహజమే. దానితోపాటు ఒక దేశ పౌరునిగా ధర్మం దేశంలో బలంగా, ప్రబలంగా ఉంటేనే సౌజన్యం, సుముఖం, సుఖం ఉంటుంది. దానికి చట్టము, సమాజము, శాస్త్రములో మంచి అవగాహన ఉండాలి. ఏ గుఱ్ఱం అయినా విడిగా వెళ్తే లాభం లేదు. ఏడు గుఱ్ఱాలను సూర్యుడు సారథిలా ఒకత్రాడుతో నడిపిస్తున్నాడో అలా సమన్వయం ఉండాలి. అన్వయం ఉంటేనే సమన్వయం సాధ్యం. ధర్మంతో మన జీవితాలను అన్వయం చేసుకోవాలి. 'ఆన్వవాయ తదన్వయే శుద్ధమతి'. కాబట్టి కుటుంబాలలో అన్వయం చాలా ముఖ్యం. అన్వయం ఉంటే సమన్వయం తేలికగా వస్తుంది. సనాతనధర్మమనేది ప్రజాతంత్రానికి గానీ, వేరు భాషలు, ఆలోచనలు ఉండే వారందరినీ కలపటానికి ఎంతో అవసరం. ఆ రోజుల్లో శంకరాచార్యులు శైవం, వైష్ణవం, గాణాపత్యం, శాక్తేయం, సౌరం, స్కందం వంటివి ఎలా దగ్గరకు తెచ్చి షణ్మతస్థాపనాచార్యులు అయ్యారో అలాంటి ప్రయత్నం నిరంతరం దేశంలో ఉండాలి. సనాతనధర్మం అనాదిగా వస్తున్న విషయం. ఏవేవో కొత్తగా వచ్చినా, గత వెయ్యి సంవత్సరాలు, అంతకు ముందు వేరొకరు ఈ దేశాన్ని పాలించినా ఇప్పటికీ కూడా హారతులు, పూజలు జరుగుతూనే



ఉన్నాయి. మధ్యలో విఘ్నాలు వచ్చినా ఏదో ఒకవైపు నదీప్రవాహం జరుగుతూనే ఉంటుంది. ఒక పెద్దనదిలో ఏదొక ప్రాంతంలోనైనా ప్రవాహం ఉంటుంది. ఇది మంచిగా ప్రవహించాలంటే ప్రభుత్వాలు కూడా సహకరిస్తే ప్రజలు మంచిగా ఉంటారు.జయేంద్ర సరస్వతీ స్వామివారు చెప్పేవారు 'యథా రాజ తథా ప్రజ' అని ఆ రోజుల్లో. ఇప్పుడు పరిస్థితి మారింది కాబట్టి 'యథా ప్రజా తథా రాజ'. అందుకని ప్రజల మధ్యలో ధర్మప్రచారం ఈ రోజుల్లో ముఖ్యము. అందుకని మనం ధర్మప్రచారం ఇంటిఇంటికీ చేరేటట్లుగా చూస్తే సనాతనధర్మం మంచిగా ఉంటుంది. ఇక్కడ opportunities ఉన్నాయి. ఉన్న అవకాశాలను చక్కగా సద్వినియోగపరచుకునేవారు కూడా ఉండాలి. కాబట్టి opportunitiesని మనం తెలుసుకొని వాటిని మనం పెంచుకోవటానికి ప్రయత్నం చేస్తూ oppositions లేకుండా చూసుకోవాలి. దీని కోసం మనం ప్రార్థన, ప్రయత్నం రెండూ చేయాలి. ప్రార్థన మాత్రం చేస్తే సరిపోదు. ప్రయత్నం మాత్రమే సరిపోదు. రెండూ ఉండాలి.

**మరొక భక్తుడు :** ***తెలియక చేసిన కర్మకు ప్రాయశ్చిత్తం చేసుకోవటం ఎలా ?***

**స్వామివారు :** మనధర్మంలో ఒక గొప్ప విషయం ప్రాయశ్చిత్తం. ప్రాయశ్చిత్తము, పరిష్కారము, పరిహారము, బహిష్కారము, ఇవన్నీ ఉంటాయి. స్వాతంత్ర్య సంగ్రామ సమయంలో విదేశీ వస్త్రాలను బహిష్కరించారు. కొన్ని విషయాలకు దగ్గరగా వెళ్ళకూడదు. పరిష్కారము మరియు పరిహారము కోసము చాలా మార్గాలు చెప్పారు. రామేశ్వరం వెళ్ళి స్నానం, సముద్ర, నదీ సంగమం వద్ద స్నానం, నామజపం, దానధర్మాలు, ఉపవాస జపాలు చెయ్యటము. అలా వ్రతాలు, నియమాలు పాటిస్తే దోషాలు, పాపాలు తగ్గిపోతాయి. అందుకని ప్రాయశ్చిత్తము అనేది ఒక అవకాశము. సంకల్పాలలో చెబుతారు 'జ్ఞాతాజ్ఞాత దోషనిర్హరణార్థం' తెలిసి కాని తెలియక కాని మన పొరపాట్లు ఏవైనా చేస్తే అవన్నీ కూడా నశింప చేస్తుంది. దాని ద్వారా మంచి పుణ్యం సుకృతం రావాలనేది ఉద్దేశ్యం. 'న కశ్చిన్ నాపరాధ్యతి' అనేది మన భారతీయ సంస్కృతి. అంటే దోషం చెయ్యని వాళ్ళు ఉంటారా ? ఎదో ఉంటుంది. తెలిసో తెలియకో ఏదో స్ఖాలిత్యం అనేది ఉంటుంది. ఇది రామాయణం మనకు అందించిన విషయం. అందుకని ఆత్మవిశ్వాసం ఉండాలి. ఎవరు ఇబ్బందులు ఎదుర్కొంటున్నా రేపు బాగుంటుందనే ఆత్మవిశ్వాసంతో ఉండాలి. ఆత్మవిశ్వాసానికి ఆదర్శం ఆంజనేయస్వామి. రామరావణ యుద్ధం వరకు పరిస్థితులను జాగ్రత్తగా నిర్వహణ చేసింది ఆంజనేయస్వామి. అందుకని ప్రాయశ్చిత్తాలు, పరిష్కారాలు అనేవి మనం తెలిసి చేసినా తెలియక చేసినా ప్రమాదాలకు పరిష్కారంగా ఉంటుంది. ప్రాయశ్చిత్తాలు, పరిష్కారాలు ఉన్నాయి కదా అని మనం పాపకర్మలు ఆచరించకూడదు. మన జయేంద్ర సరస్వతీ స్వామివారు చెబుతారు

*'భగవద్గీతా కించిదధీతా గంగాజల లవకణికా పీతా*
*సకృదపి యేన మురారిసమర్చా క్రియతే తస్య యమేన న చర్చా'*

అంటే 18 అధ్యాయాలు కాకపోయినా కనీసం 4 లేదా 5 శ్లోకాలైనా చదవాలి. 'గంగాజల లవకణికా పీతా' గంగా తీర్థంకొద్దిగా తీసుకున్నా మంచి పుణ్యం వస్తుంది. అందుకని ఎక్కువ పాపాలు చేసి దానికి తగ్గట్లుగా గంగాజలం తీసుకుంటాను అని భావించకూడదు. జరిగిపోయిన విషయాలకు ప్రాయశ్చిత్తాలు ఉంటాయి. ఇంకా చెడు ప్రయత్నాలు జరగకుండా ఉండటానికి సద్బుద్ధి, జాగృతి చాలా అవసరము. ఈ విధంగా పరిష్కారాలు, ప్రాయశ్చిత్తాలు మనమతంలో ఉండే గొప్ప విషయము కాని శ్రద్ధ అవసరము.

# శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామివారి విజయయాత్రా విశేషాలు




**21-03-23** మంగళవారం నుండి **04-04-23** వరకు పూజ్యశ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామివారు తెనాలి దగ్గరి పెదరావూరులో శ్రీమహావిద్యాపీఠంలోని పరమాచార్యులవారి మండపము నందు శ్రీ మహా త్రిపురసుందరీ సమేత చంద్రమౌళీశ్వర స్వామి త్రికాల పూజలు, ఉగాది విశేష పూజలు, వసంత నవరాత్రి మహోత్సవములు, శ్రీరామ పట్టాభిషేకము, విశేష హోమములు నిర్వహించారు. అక్కడి అభయహస్త సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో అభిషేకము పూజలు చేసి భక్తులను తీర్థ ప్రసాదములతో అనుగ్రహించారు.




**01-04-23** - శనివారం నాడు తెనాలి పట్టణంలో పౌర ఆశీర్వాద సభ అత్యంత వైభవంగా శోభాయాత్రతో మొదలైంది. తాలూకా హైస్కూల్ గ్రౌండ్స్‌లో ఆశేష భక్తజనసందోహాన్ని ఉద్దేశించి శ్రీస్వామివారు అనుగ్రహ భాషణం చేశారు.





**01-04-23** - శనివారంనాడు తెనాలి పట్టణంలో శివాలయము, అష్టలక్ష్మీ ఆలయం, వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం, బాలత్రిపురసుందరీ ఆలయాలను స్వామివారు దర్శించుకుని విశేష పూజలు నిర్వహించారు. భక్తులను ఉద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు.







**05-04-23** బుధవారం నుండి శ్రీస్వామివారు. విజయవాడ లబ్బీపేటలోని వెంకటేశ్వరస్వామి ఆలయం ప్రాంగణంలో శ్రీమహాత్రిపుర సుందరీ సమేత చంద్రమౌళీశ్వరస్వామి త్రికాల పూజలు నిర్వహిస్తున్నారు. వెంకటేశ్వరస్వామికి విశేషపూజలు చేశారు. అలాగే లోక క్షేమం సంకల్పంతో జరుగుతున్న యాగం యొక్క హోమద్రవ్యాలను అభిమంత్రించారు.







**05-04-23** - బుధవారంనాడు విజయవాడలోని శారదా జూనియర్ కళాశాల 50వ వార్షిక సంవత్సరం సందర్భంగా శ్రీస్వామివారు సందర్శించి ఆశీర్వదించారు. కృష్ణాజిల్లా వార్షిక వేదపరీక్షా సభ వజ్రోత్సవమును సందర్శించి అనుగ్రహ భాషణం చేసి ఆశీర్వదించారు.



**06-04-23** - గురువారంనాడు విజయవాడలోని KBN కళాశాల, SKPVV ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూట్లను సందర్శించి అనుగ్రహ భాషణం చేశారు.








**10-04-23** సోమవారం నాడు శ్రీస్వామివారు. విజయవాడ దగ్గర చినకంచి చేరుకుని అనూష హోమం పూర్ణాహుతి కార్యక్రమం సందర్శించి, అక్కడి పరమాచార్యులవారి మందిరంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చినకంచిలోని భక్తులు స్వామివారికి పుష్పాభిషేకం చేశారు.





**11-04-23** మంగళవారం, గుంటూరులో పూజ్యశ్రీ స్వామివారు ధూళిపాళ కళావేదిక ఆడిటోరియంలో “వెంకటాద్రి మహాత్మ్యం” పుస్తకాన్ని విడుదల చేసి ఆశీర్వదించారు. మారుతీ ఆలయాన్ని, గాయత్రి ఆలయాన్ని దర్శించుకుని పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రసాదాలు అందింపజేసి అనుగ్రహ భాషణం చేశారు.





**12-04-23** బుధవారం, పూజ్యశ్రీ స్వామివారు గుంటూరులోని శ్రీ కంచి కామకోటి పీఠం సాంస్కృతిక కేంద్రాన్ని, సత్యనారాయణస్వామి ఆలయాన్ని మరియు వేద పాఠశాలను సందర్శించి అనుగ్రహ భాషణం చేశారు.





**13-04-23** గురువారం, గుంటూరు నుండి ఒంగోలు శిబిరానికి వెళ్లే మార్గంలో పూజ్యశ్రీ స్వామివారు గ్రంధి వినాయక స్వామి ఆలయాన్ని మరియు శ్రీ లలితా పీఠాన్ని సందర్శించి భక్తులను అనుగ్రహ భాషణం మరియు ప్రసాదాలతో ఆశీర్వదించారు.





**14-04-23** శుక్రవారం, ఒంగోలులో తమిళ నూతన సంవత్సరం సందర్భంగా స్వామివారు భక్తులకు రూపాయి నాణేలు ఇచ్చి ఆశీర్వదించారు.







**14-04-23-** టిటిడి కల్యాణ మండపంలో జరుగుతున్న రాజశ్యామల హోమం పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం భక్తులను ఉద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు.



15-04-23 ప్రకాశం జిల్లా ఒంగోలు దగ్గర రామతీర్థం వద్ద 100 సంవత్సరాల ప్రాచీనమైన శివాలయాన్ని శ్రీస్వామివారు దర్శించుకున్నారు.



**16-04-23** (ఆదివారం, సాయంత్రం) - ఒంగోలు పట్టణంలో జరిగిన శోభాయాత్రకు పూజ్యశ్రీ స్వామివారి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు, వేదపండితులు వేద పఠనంతో ఊరేగింపును నడిపించారు. మంగమూరు డొంక నుంచి ప్రారంభమైన సాయిబాబా దేవాలయం లాయర్‌పేట, కొండయ్య బంక్ రోడ్డు, కోర్టు సెంటర్, గాంధీ రోడ్డు, ఏనుగు చెట్టు సెంటర్, కొండ మీద శివాలయం మరియు చెన్నకేశవాలయం మీదుగా తటా ప్రసాద్ కల్యాణమండపం వరకు జరిగింది. స్వామివారు అనుగ్రహ భాషణం చేసి ఆశీర్వదించారు.



**18-04-23** (మంగళవారం, సాయంత్రం) - పూజ్యశ్రీ స్వామివారు ఒంగోలులోని ఆంధ్ర కేసరి విద్యా కేంద్రం కళాశాలను సందర్శించి, ఆర్ఎస్ఎస్ బృందాన్ని ఆశీర్వదించారు, అనంతరం గడియారం సెంటర్‌లోని శ్రీ రామాలయం మరియు శ్రీ కంచి కామకోటి పీఠం పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయాలను సందర్శించారు. అనుగ్రహ భాషణం మరియు ప్రసాదాలతో భక్తులను ఆశీర్వదించారు.







**19-04-23** (బుధవారం, సాయంత్రం) - స్వామివారు ఒంగోలు పట్టణలోని న్యాయవాదులను అనుగ్రహ భాషణం మరియు ప్రసాదాలతో ఆశీర్వదించారు, అనంతరం ఏప్రిల్ **25**న ఆది శంకరాచార్య జయంతి సందర్భంగా “శంకర విజయం” (శ్రీ ఆదిశంకరాచార్యుల జీవిత చరిత్ర)పై నాటకం ప్రదర్శించబడింది. స్వామివారు ఆద్యంతం నృత్యనాటికను ఆనందంగా తిలకించి కళాకారులను ఆశీర్వదించారు.





**30-04-23** (ఆదివారం) - పూజ్యశ్రీ స్వామివారు మూడుకాలాల పూజను పూర్తి చేసిన తర్వాత కామకోటివాణి ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. అనంతరం దిండివనం, పాండిచ్చేరి విద్యార్థులకు, కంచి కామకోటి వైఖానస పాఠశాల, ఆవడికి చెందిన విద్యార్థులకు ప్రమాణ పత్రములు, మరియు ప్రసాదాలతో అనుగ్రహించారు.





**01-05-23**(సోమవారం) శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామివారు నెల్లూరు దగ్గర జొన్నవాడ శ్రీమఠ శిబిరానికి చేరుకుని, అక్కడి శ్రీ మల్లికార్జునస్వామి సమేత కామాక్షి అమ్మవారి దేవాలయంలో, మే 1వ తేదీ ఉదయం కుంభాభిషేకం మరియు ప్రాణ-ప్రతిష్ట, నిర్వహించారు. అంతకుముందు, సకల దేవతలకు (కుంభాభిషేకానికి పూర్వం చేయవలసిన) కల్యాణాన్ని నిర్వహించారు. ఆపై యాగశాలలో జరిగే హోమాలను, ఇతర క్రతువులను పర్యవేక్షించి ఆశీర్వదించారు.






**03-05-23** (బుధవారం, ఉదయం) - పూజ్యశ్రీ స్వామివారు శ్రీ మల్లికార్జునస్వామి సమేత కామాక్షి అమ్మవారి ఆలయ కుంభాభిషేక మహోత్సవ శుభ సందర్భంలో శ్రీ కంచి కామకోటి హిందూ ధర్మ ప్రచార రథాన్ని ప్రారంభించి భక్తులను ఆశీర్వదించారు.



**05-05-23** (శుక్రవారం, పౌర్ణమి) – పూజ్యశ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామివారు తిరుపతిలోని గంగమ్మ దేవాలయాన్ని సందర్శించి గంగమ్మ దేవి కుంభాభిషేకాన్ని నిర్వహించారు. అనంతరం శ్రీ ఆదిశంకరాచార్యులు రచించిన గంగాష్టకం భక్తులచే పఠింపచేసి, భక్తులపై అభిషేక జలాన్ని ప్రోక్షించి ఆశీర్వదించారు.




**07-05-23**(ఆదివారం)పూజ్యశ్రీ స్వామి వారు రేణిగుంట-తిరుపతి రహదారి (అంకురా ఆసుపత్రి సమీపంలో) నుండి తిరుపతి వద్ద “పరమాచార్య శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి మహాస్వామి మార్గ్” – కొత్త రహదారి ప్రారంభోత్సవాన్ని చేశారు. పూజ్య మహాస్వామి వారి చిత్రపటంతో కూడిన ఫలకాన్ని ఆవిష్కరించిన అనంతరం స్వామివారు అనుగ్రహ భాషణం చేశారు. **1932**లో మహాస్వామివారి తిరుపతి యాత్ర చరిత్రను చదివి వినిపించారు. తిరుపతి పార్లమెంట్ సభ్యులు శ్రీమద్దిల గురుమూర్తి, తిరుపతి ఎమ్మెల్యే శ్రీ భూమన కరుణాకర్ రెడ్డి, అధికారులు, మున్సిపల్ కార్పొరేషన్ సభ్యులు, ఇతర భక్తులు పాల్గొన్నారు.




**07-05-23**(ఆదివారం) పూజ్యశ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామివారు తిరుపతి సమీపంలో ఉన్న ఏర్పేడులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ-తిరుపతి క్యాంపస్‌ను సందర్శించారు. క్యాంపస్‌లో నిర్మించిన నూతన భవనం వద్ద స్వామివారిని డైరెక్టర్ శ్రీ కె.ఎన్. సత్యనారాయణ మరియు ఇతర అధ్యాపకులు స్వాగతించారు. ఇన్‌స్టిట్యూట్ మాస్టర్‌ప్లాన్ ఎగ్జిబిట్‌లో క్యాంపస్ యొక్క ముఖ్య లక్షణాలను డైరెక్టర్ వివరించారు.

ఆడిటోరియంలో విద్యార్థులు శ్రీఆదిశంకరాచార్యులవారి గురు స్తోత్రాన్ని ప్రార్థన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రొ॥సత్యనారాయణగారు స్వాగతోపన్యాసం చేశారు. మద్రాస్ ఐఐటీ డైరెక్టర్ ప్రొ॥ కామకోటిగారు తన అనుభవాలను పంచుకున్నారు. స్వామివారు విద్యార్థులను, అధ్యాపకులను, ఇతర సభ్యులను అనుగ్రహ భాషణంతో ఆశీర్వదించారు.

# సనాతన ధర్మ సేవా గ్రామమ్ – పొదిలి

ఒక ధృఢ సంకల్పం. దానికి భగవద్భక్తి, గురుభక్తే ప్రేరణ. సనాతన సాంప్రదాయములోని అనేక ఉత్కృష్టమైన విషయములు, వేదోపనిషత్తుల సారాంశములు, పురాణేతిహాసముల యందలి ధర్మములు, మర్మములు, నీతులు, సమకాలీన విద్య, ఆధునిక టెక్నాలజీతోపాటు విద్యార్థులు అభ్యసించాలి. నేటి విద్యావ్యవస్థలోని అసంపూర్ణమైన విధానం నుంచి ఒక సంపూర్ణమైన, సమగ్రమైన జ్ఞాన వికాసం కలిగించే వ్యవస్థను తయారుచేయాలనే సంకల్పం.

ఒకనాడు కంచి పీఠమునకు వచ్చిన ఒక భక్తుడు ఒంగోలు దగ్గర పొదిలి అనే ప్రాంతంలో 31 ఎకరముల భూమిని పీఠానికి సమర్పించుకున్నారు. స్వామివారు వారి అలోచనలకు తగిన విధంగా ఒక నిర్మాణం చేయటానికి ఇదే సరైన అవకాశం అనుకున్నారు. కంచిపీఠం నుండి కొంతమంది వెళ్ళి ఆ ప్రాంతాన్ని పర్యవేక్షించి వారు ఒంగోలుకి చాలా దూరంలో దట్టమైన ముళ్ళమొక్కలు, ఎత్తుపల్లాలు, అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి చూసి ఇక్కడ ఏమైనా చేయడం అసాధ్యమనుకున్నారు. స్వామివారి దగ్గరకి వచ్చి పరిస్థితి చెప్పి, లాభం లేదని పెదవి విరిచారు. అయినా వారి సంకల్పం చెక్కు చెదరలేదు.



శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామివారు 1995వ సంవత్సరం నవంబరు 11వ తేదీన పొదిలి గ్రామాన్ని సందర్శించి అక్కడి వారితో సంభాషించారు. అప్పటి చిత్రపటమే ఇది. అప్పుడే గ్రామ పరిసరాలను, అక్కడి వనరులను, అవసరాలను గ్రహించారు. దీక్షతో వారి ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. అసాధ్యం సుసాధ్యమయ్యింది. ఈనాటికి వారి ఆలోచనలన్నీ ఆకృతిదాల్చి ఈ విధంగా సనాతన ధర్మ సేవా గ్రామమ్ నిర్మించబడుతోంది.



శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామివారు ధర్మప్రచారం కొరకు సంకల్పించిన విజయయాత్రలో ప్రజల హృదయాలలో హైందవ సంస్కృతి బీజాలను నాటుతూ, ఆధ్యాత్మిక, ధార్మిక జీవన వికాసాన్ని కలుగజేస్తూ ముందుకు సాగుతున్నారు. వారి యాత్రలో భాగంగా ఒంగోలు దగ్గరి పొదిలి గ్రామాన్ని సందర్శించారు.



ప్రస్తుత సమాజంలో సనాతన సాంప్రదాయాలు, సదాచారాలు, వంశపారంపర్యంగా నిర్వహించాల్సిన క్రతువులు మరుగునపడి యువత ఆధునిక, పాశ్చాత్య జీవనవిధానానికి అలవాటుపడుతోంది. ఇటువంటి పరిస్థితి నుండి యువతకు, పిల్లలకు తిరిగి మన ధర్మస్వరూపాన్ని సంస్కృతిని, సాంప్రదాయాలను నేర్పిస్తూ, వేదములు, ఉపనిషత్తులు, పురాణములు, ఇతిహాసములలో సారాన్ని వారికి తెలియజేస్తూ, వీటితోపాటు సమకాలీన విద్యలో కూడా శిక్షణ ఇచ్చి ఒక ఆదర్శవంతమైన మేటి యువతను తయారుచేయడానికి శ్రీ స్వామివారు రూపకల్పన చేసిన బృహత్తర ప్రణాళికే ఈ సనాతన ధర్మ సేవా గ్రామమ్. ఇది ఒంగోలుకి 50కిలోమీటర్ల దూరంలో ఉన్న పొదిలి గ్రామంలో 31 ఎకరాల విశాల ప్రాంగణంలో, చక్కటి పర్యావరణంలో, ప్రశాంత వాతావరణంలో నిర్మించబడుతోంది.



## సనాతన ధర్మ సేవా గ్రామం ప్రణాళిక :

**శ్రీ కంచి కామకోటి శంకర విద్యాలయం :** విద్యార్థులకు 6వ తరగతతి నుండి 12వ తరగతి వరకు సి.బి.ఎస్.ఇ, లేదా స్టేట్ సిలబస్ విద్యలో శిక్షణ.

**శ్రీ కామాక్షీ స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్ :** స్థానిక ప్రజలకు కుండల తయారీ, హార్టికల్చర్ మరియు అగ్రికల్చర్, టైలరింగ్, ఎలక్ట్రికల్, ప్లంబింగ్, కార్పెంటరీ, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్ మరియు డ్రైవింగ్ మొదలైన విషయాలలో శిక్షణ ఇవ్వబడుతుంది. శిల్పకళ, నాదస్వరము, దేవాలయాలు, వ్యవసాయం, సేవాసంస్థల నిర్వహణపై సర్టిఫికెట్ కోర్సులు పెట్టి ఆసక్తిని అనుసరించి శిక్షణ ఇవ్వబడుతుంది.

**శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి ఇనిస్టిట్యూట్ ఫర్ సంస్కృత అండ్ వేదిక్ స్టడీస్ :** సంస్కృతం మరియు సనాతన ధర్మంపై దృష్టి సారించి వైదిక అధ్యయనాలను ప్రచారం చేయడానికి శిక్షణ ఇవ్వబడుతుంది.

**శ్రీ శంకర అద్వైత పరిశోధనా కేంద్రం :** విస్తృతమైన గ్రంథాలయం ఏర్పాటు చేసి వేదాలు, వేదాంగాలు, ఉపనిషత్తులపై పరిశోధనలు చేయించటం.

**శ్రీ శంకర వసతి గృహం :** ఆధునిక సౌకర్యాలతో సదాచారంగా విద్యార్థులు మరియు అధ్యాపకులకు భోజన వసతి ఉంటుంది. గదికి ముగ్గురు చొప్పున 100 మంది విద్యార్థులు ఇక్కడ ఉండవచ్చు.

**శ్రీ జయేంద్ర సరస్వతీ ఆరోగ్యకేంద్రం :** స్థానిక ప్రజలకు మరియు పాఠశాల విద్యార్థులకు ఆరోగ్య సంరక్షణ అందించేందుకు నిర్వహించబడుతుంది.

**హనుమాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ :** వ్యాయామశాల, యోగా, మరియు ఇండోర్ గేమ్స్‌కి ఇక్కడ సదుపాయం చేయబడింది.



పాఠశాలలోని తరగతి గదులకు సప్తఋషుల పేర్లు పెట్టి వైదికవిద్య అభ్యాసానికి వాటిని కేటాయించారు. అలాగే ఇతర తరగతి గదులు, హాళ్ళు, ఆడిటోరియంలకు గొప్ప భారతీయ సాధువుల పేర్లు పెట్టబడతాయి.

ఒకపక్క సమకాలీన విద్యను అభ్యసిస్తు, ఆధినిక వసతులను ఉపయోగించుకుంటూనే, మనకు ఆధారమైన ధర్మాన్ని, సనాతన సదాచారాలను ఆచరిస్తూ, అనుసరిస్తూ, విస్తృత ప్రచారం చేయడమే ఈ సేవా గ్రామం యొక్క లక్ష్యం. వస్త్రధారణలో, ఆహారంలో, నడవడికలో, భాషలో అది ప్రతిఫలిస్తుంది. ఇక్కడి విద్యాభ్యాసంతో, ఇదే భావజాలం కలిగిన మేధావులను, విద్వాంసులను, కళాకారులను, ప్రజాసేవకులను, రైతులను అందివ్వడమే ఈ ధార్మిక విద్యాలయ సంకల్పం.





విజయయాత్రలో భాగంగా 15-04-2023 శనివారంనాడు పొదిలి 'సనాతన ధర్మ సేవా గ్రామమ్' ను సందర్శించిన సందర్భంలో స్వామివారు అనుగ్రహ భాషణం చేస్తూ ప్రకాశం జిల్లా పొదిలిలోని సనాతన ధర్మ సేవా గ్రామమ్ తెలుగువారందరికీ జ్ఞానప్రకాశం ఇవ్వాలని ఆశీర్వదించారు.

ఇంతటి గొప్పసంకల్పం ఆచరణలో పెట్టడానికి అంగబలంతో పాటు అర్థబలం కూడా కావాలి. సమాజ సంక్షేమం కోరకు తమవంతు సహాయపడాలనుకునేవారికి, ధర్మాచరణలో, సత్కార్యాలలో పాలుపంచుకోవాలనే వారికి ఇది చక్కని అవకాశం. మీవంతు సాయంగా రూ.51,001/- విరాళంతో పోషకుడిగా, రూ.1,00,001/- విరాళంతో రాజపోషకుడిగా, రూ.5,00,001/- లేదా అంతకంటే ఎక్కువ విరాళంతో మహారాజపోషకుడుగా విద్యార్థులను చదివించవచ్చు. కేవలం రూ.1,116/- విరాళంతో సభ్యత్వము పొందవచ్చు. నిర్ణీతమొత్తంలో నెలవారి విరాళంగా ఇవ్వవచ్చు. మీరు INR లేదా విదేశీ కరెన్సీలో విరాళం ఇవ్వడానికి కూడా అవకాశం ఉంది. ఈ ట్రస్టుకు 80G మినహాయింపు ఉంది. విరాళానికి ట్రస్టు నుండి రసీదులు ఇవ్వబడతాయి. విదేశాల నుండి విరాళాలు ఇచ్చినవారు కూడా FCRA కింద అర్హులే.

**For INR Donations :**
Sri Pratyaksha Charitable Trust,
CITY UNION BANK LTD,
Thousand Lights Branch,
SBA/CNO : 049001000645148
IFSC : CIUB000049

UPI Mobile : 9566060904
Membership Rs.1116/- onwards


Please give your
Name & Mobile No.
in the description
during the payment

Sri Pratyaksha Charitable Trust
+91 95660 60904
9566060904-4@okbizaxis

**For Oversees Donations :**
Sri Pratyaksha Charitable Trust,
State Bank of India
New Delhi Main Branch
A/C : 40092263907 IFSC : SBIN0000691
Br.Code : 00691 SWIFT : SBININBB104

**Please get in touch with our volunteers for further information**
Ramesh Bhattiprolu - 9845516382
Prabhakar MK - 9840911091
Mahaswami Seva Samithi - 9490729624,
Mahaswami Seva Samithi - 9666329624

# పాదుకా మణిమండపం – ఓరిక్కై



పూజ్యశ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వామివారు శ్రీ కంచి కామకోటి పీఠ పరంపరలో 68వ ఆచార్యులు. ఆయన మీద గల అపారగౌరవంతో కంచి పట్టణ సరిహద్దులలో 5కి॥మీ॥ దూరంలో ఉన్న ఓరిక్కై గ్రామంలో 28-1-2011 నాడు వారి భక్తులు ఒక పవిత్రమైన ఆలయాన్ని నిర్మించి సమర్పించుకున్నారు.

మణిమండపంగా పేరుగాంచిన ఈ ఆలయము పురాతన సంప్రదాయాలను, ఆధునిక ఆకాంక్షలను దృష్టిలో వుంచుకుని నిర్మించబడినది. విశేషం ఏమిటంటే దీనిని కేవలం రాతితోనే నిర్మించారు. ఇలాంటి నిర్మాణాలు 'శుద్ధ' విభాగానికి చెందినవి. సాధారణంగా గుళ్ళు రాయి, ఇటుకలు, చెక్క, కంకర, సున్నం, ఇసుకల మిశ్రమంతో నిర్మాణం చేస్తారు. వీటిని మిశ్రమ విమానాలు అంటారు. తంజావూరులోని గొప్ప ఆలయం శుద్ధరీతిలో అప్పటి చక్రవర్తులు నిర్మించారు.

ఇంకో విశేషం ఏమిటంటే ప్రధాన ఆలయం వంద అడుగుల ఎత్తులో మహాస్వామివారు మన మధ్య గడిపిన 100 సంవత్సరాలకు ప్రతీకగా ఉంది. పురాతన ఆలయాలన్నీ ఆధ్యాత్మిక చింతనను, సంప్రదాయాలను ప్రతిబింబిస్తున్నాయి. ఉపరితల శిఖరం 56 అడుగులు, 1:1.3/4 నిష్పత్తిలో ఉన్న ఈ శిఖరాన్ని 'ఆనంద విమానమని' అంటారని, అంటే సంతోషానికి చిహ్నం అని ఆలయ స్థపతి అయిన శ్రీ గణపతి తెలిపారు.

ప్రధానంగా గణపతి స్థపతి వంశస్థులు పూర్వీకులు తంజావూరు ఆలయ నిర్మాణానికి సంబంధించిన వారే. గణపతిగారికి వారి కుమారుడు, అన్నదమ్ముల సహాయం చాల ఉంది. ప్రఖ్యాతిగాంచిన గణపతి అనే పేరుతోనేవున్న వళ్ళువర్విగ్రహాన్ని, వళ్ళువర్కొట్టంను వారి బంధువు సహాయంతోనే రూపకల్పన చేశారు. వీరిరువురు తమిళనాడులోని కరైక్కుడి సమీపంలోని పిళ్ళైయార్పట్టి గ్రామంలోని వారే. అక్కడ వారిని గణేశా అనే పేరుతో ఆప్యాయంగా పిలుస్తారు. ఇద్దరూ శిల్పకళాశాస్త్రంలోను వాస్తుశిల్పశాస్త్రంలోను దిట్టలు.

కాంచీపురానికి 50కి॥మీ॥ దూరంలో ఉన్న పత్తిమలైకుప్పం అనే గ్రామం నుండి ఈ గుడికోసం తెల్లటి గ్రనైట్‌రాళ్ళు తెప్పించారు. ఈ ఆలయం రెండు భాగాలుగా ఉంది. ఒకటి శిఖరంతో వున్న ప్రధాన విమానము. రెండవది 100 స్తంభాలతో ముందువున్న మండపం.

ఉపపీఠం మీద వున్న ప్రధాన శిఖరం అనేక ఆధ్యాత్మిక ఆలోచనలు తెప్పిస్తూ సాంప్రదాయ పద్ధతితో కూడివున్నది. అయిదు





అంచెలతో కూడిన ఈ శిఖరంపై రాతితో చేయబడిన 'స్తూపిక' వున్నది. శిఖరానికి శోభాయమానంగా అన్ని మూలల్లో చిన్ని 'కూటాలు' మధ్య మధ్యలో శిలాతోరణాలు, గాలివెలుతురు గవాక్షాలు, కేంద్రబిందువుగా 'భద్రాస్' అందంగా అమర్చివున్నాయి.

ఇక్కడి గర్భాలయానికి ఒక ప్రత్యేకత ఉంది. నలువైపులా నాలుగుస్తంభాలతో ఉన్నతమైన పీఠంలా ఉంటుంది. వీటి మధ్యలో నుంచి వెళ్ళడానికి తగినంత చోటు ఉంది. ప్రదక్షిణం చేయడానికి కూడా కేంద్రీకృతమైన విశాలమైన త్రోవ ఉంది. అలా పీఠం మధ్యలో ప్రతిష్ఠించిన మహాస్వామివారి విగ్రహానికి రెండు విధాల ప్రదక్షిణ చేయవచ్చు. ఆ మూర్తికి ముందు గంధం చెక్కతో చేయబడి, బంగారుతొడుగుతో వున్న మహాస్వామివారి పాదుకలు ఉన్నాయి. ప్రధానంగా ఇది ఒక మండపం. అందుకే 'పాదుకా మణిమండపం' అని అంటారు.

ఈ కోవకు చెందిన వాటిని వాస్తుశిల్ప పరిశీలనాత్మక నిర్మాణాలుగా పరిగణిస్తారు. 'మండపిక ప్రసాదాలు' పురాతన కాలం నుంచీ ఇలాంటి కట్టడాలు ఉన్నాయి. ఉదాహరణకు కాశ్మీరులోని శ్రీనగర్‌లో శంకరాచార్య ఆలయం కూడా 'మండపిక ప్రసాదం' లాగానే నిర్మించారు.

ఒకప్పుడు పురాతనమైన శంకరాచార్య గుడి వృత్తాకార గర్భగుడిని కలిగివుండేది. 1644వ సంవత్సరంలో గోపదేవా అనే హిందూరాజు గర్భగుడికి ఒక కేంద్రవేదికను 4 స్తంభాల సహాయంతో నిర్మాణం చేశారు. ఇలా స్తంభాలతో గూడిన గర్భగృహాలను 4, 5 శతాబ్దాలలో గుప్తవంశరాజులు చాలా నిర్మించారు. మధ్యప్రదేశ్‌లోని నివిడిసా ఆలయం, కర్ణాటకలోని బాదామి (వాతాపి అని పిలవబడిన) ఆలయాలు ఈ కోవకు చెందినవే. మనదేశంలోనే కాదు కంబోడియా లాంటి విదేశాల్లో కూడా ఇలాంటి గుళ్ళని నిర్మించారు. ఈశాన్యకం కంబోడియాలోని సంభోర్ప్రయ్కుక్ అనే 4వ శతాబ్దపు పురాతన ఆలయం కూడా ఈ పద్ధతిలో నిర్మించినదే. కంబోడియాలోని చాలా ఆలయాలు మండపికశైలిని అనుసరించే నిర్మితమై యున్నాయి.

మహాస్వామివారికి కంబోడియా చరిత్రపైన, అక్కడి ఆలయ విశేషాల మీద అభిమానం ఎక్కువగా ఉండేది. అందుకేనేమో ఇక్కడి మణిమండపం కూడా వారి దివ్య ఆశీస్సులతో యాదృచ్ఛికంగా అలాగే నిర్మించారు. ఇక్కడి గుడిలో రెండు శిల్పాలలో సంస్కృత ధ్యాన శ్లోకాలను ప్రప్రథమంగా ప్రస్ఫుటం



చేయడం ఇంకో ప్రాముఖ్యమైన విషయం.

ప్రధాన ఆలయ దక్షిణగోడ వైపువున్న శిల్పంలో గురుపరంపర – నారాయణ, బ్రహ్మ, వాశిష్ఠ, శక్తి, పరాశర, వ్యాస, శుకమహర్షులతో పాటు గౌడపాద, గోవిందపాద, గోవిందయోగీంద్ర, తమ శిష్యగణంతో ఆదిశంకరాచార్యులువారు మనకు దర్శనమిస్తారు. సందర్శకులు ఈ ధ్యాన శ్లోకాలని విస్తృతమైన శిల్పాలతో అవగాహన చేసుకోవడానికి సాధ్యమౌతుంది. శిల్పకళానైపుణ్యాన్ని భక్తులకు ఈ విధంగా అందించడం గొప్ప ప్రక్రియ.

అలాగే ఉత్తరం గోడవైపు వున్న శిల్పం ప్రదోషసమయ శివతాండవరూపం – 6వ శతాబ్దమునాటి బాదామి శిల్పకళా నైపుణ్యాన్ని తెలియజేస్తుంది. సంధ్యాశివతాండవ స్తోత్రం తెలిసినవారు ఈ శిల్పాన్ని చూస్తూ పరవశించిపోతారు. దక్షిణంవైపు గోడపై ఉన్న మనోహరమైన 'గణేశ'శిల్పం చూపరులను ఆకట్టుకుంటుంది. గుడిప్రవేశ ద్వారానికి ఇరువైపులా గంగా, యమున శిల్పాల దర్శనం కమనీయం. వెలుపలి ద్వారబంధానికి 16లతలు రూపకల్పన చేశారు. ఇవి 16 గురురూపాలుగా చిత్రీకరించారు. లోపలి ద్వారబంధానికి ద్వాదశజ్యోతిర్లింగాలు దర్శనమిస్తాయి.

100 స్తంభాలతో విరాజిల్లుతున్న మండపం అశ్వంతో ఉన్న అంతరిక్షరథంలా కనిపిస్తుంది. పైకప్పు మధ్యలో ఒక వృత్తాకారపు మండలంలో మేష, మిథునం మొదలైన 12రాసుల సంకేతంగా చేసిన కల్పన అద్భుతంగా ఉంది. ఈ మండపానికి అందంగా





అలంకరించబడిన ఏనుగు శిల్పాలతో మూడువైపులా మెట్లున్నాయి. వసారాలో ముందున్న చక్రానికి 12చువ్వలు – 12 రాసులకు/12 మాసాలకు ప్రతీకలు. అశ్వశిల్పాలను రథానికి అమర్చినందువల్ల ఒక అంతరిక్షరథంపై దివ్యమైన అశ్వాలతో కాల్పనికి ప్రదేశానికి అంతులేని అంతరిక్ష ప్రయాణంలాగా అనుభూతి చెందేలా ఉంటుంది. ముందువున్న బ్రహ్మాండమైన ఏకశిలా నంది తమిళనాడులోనే గొప్ప నందిగా ఉంటుంది. ఈ ఆలయ నంది మండపానికి, రాజగోపురానికి శ్రీశంకర విజయేంద్ర సరస్వతీ స్వామివారు 22-06-2018 నాడు మహాకుంభాభిషేకం చేశారు. పూజ్యశ్రీ విజయేంద్ర సరస్వతీ స్వామివారు 2021లో వ్యాసపూజ, చాతుర్మాస్యదీక్ష ఓరిక్కైలోని మణిమండపంలోనే జరిపారు. (24-07-2021 నుండి 20-09-2021వరకు) శాస్త్ర సాంప్రదాయబద్ధంగా నిర్మించిన ఈ ఆలయం తమిళనాడులో భౌగోళికంగా ఖ్యాతి చెందుతుంది అనడంలో సందేహం లేదు. *



శ్రీ ఎ. కుప్పుస్వామిగారు ఆంగ్లంలో రచించిన 'SHANKARACHARYA and His connection with kanchipuram' అనే ఎనిమిది అధ్యాయాల పుస్తకం నుండి తెలుగు అనువాదం క్రిందటి సంచిక తరవాతి భాగం...

# కాంచీపురంతో శ్రీశంకరాచార్యుల అనుబంధం

### నాలుగు ధామాలలో శంకరులు

చార్‌ధామ్‌గా ప్రాచుర్యం పొందిన భారతదేశంలోని నాలుగు పవిత్ర, సంప్రదాయ స్థలాలకు శంకరులు ప్రయాణించడాన్ని కూడా పేర్కొన్నారు. దస్‌నామి సన్యాసులు నాలుగు మూలలలో ద్వారక, బద్రీనాథ్, జగన్నాథ్ (పూరి) రామేశ్వరంలోని పుణ్యక్షేత్రాలను సందర్శించడం అన్నది నేటికి కూడా ఉన్నది. ఈ సంప్రదాయ క్షేత్రాలకు శంకరుల యాత్రను శంకర దిగ్విజయం వివరిస్తుంది. ఆచార్యుల రామేశ్వరం పర్యటనను ఈ గ్రంథం ఇలా అభివర్ణిస్తోంది:

శ్లో ॥ అథ శిష్యవరైర్వృతః సహస్రైరనుయాతః స సుధన్వనా చ రాజ్ఞా,
కకుభో విజిగీషురేవ సర్వాః ప్రథమం సేతుముదారధీః ప్రతస్థే. (XV-1)
అభిపూజ్య చ తత్ర రామనాథం సహ పాండ్యైః స్వవశే విధాయ చోలాన్. (XV-4)

(వేలాదిమంది శిష్యులు, రాజైన సుధన్వుడితో కలిసి శంకరులు మొదట రామేశ్వరానికి బయలుదేరి వెళ్ళి, శ్రీరామనాథుని

అర్చించారు.)

అదే గ్రంథంలోని ఆరవ ఖండంలో ఐదు శ్లోకాలు (56 -60) శంకరులవారు తూర్పున ఉన్న బద్రీనాథ్ పర్యటన గురించి పేర్కొంటుంది. 15వ ఖండంలోని 73వ శ్లోకం ఆచార్యులవారు పశ్చిమాన ఉన్న ద్వారకను పర్యటించడాన్ని వివరిస్తుంది. ఆ శ్లోకం ఇలా చెప్తుంది:

**శ్లో ॥ విషయేషు వితత్య నైజ భాష్యాణ్యథ సౌరాష్ట్రముఖేషు తత్ర తత్ర,**

**బహుధా విబుధైః ప్రశస్యమానో భగవాన్ ద్వారవతీమ్ పురీం వివేశ. (XV-73)**

చిద్విలాసుని శంకర విజయం ఇతర జీవితచరిత్రలలో చెప్పినట్టు నర్మద నది ఒడ్డుకు కాకుండా గోవింద భగవద్పాదులవారు బదరీలో శంకరులకి సన్యాస దీక్షను ఇచ్చారని పేర్కొంటుంది.

ఈ గ్రంథంలోని ఎనిమిదవ అధ్యాయంలో వచ్చే మూడు శ్లోకాలు (37,38, 46) శంకరులు తనకు సన్యాస దీక్షను ఇచ్చేందుకు తగిన గురువును అన్వేషిస్తూ ఉత్తరంలో ఉన్న బద్రీనాథ్‌ను చేరుకున్నారని, బదరీలో ఆయన గోవింద భగవత్పాదులవారిని కనుగొన్నారని పేర్కొంటున్నాయి:

**శ్లో ॥ నిర్జగామ స్వయం తూర్ణం క్రమ సన్న్యాసలబ్ధయే,**
**నిజదేశికతాభాగ్యపద భాజన భావినం.**
**అన్విష్య శంకరాచార్యః సర్వత్ర జగతీ తలే,**
**క్రమేణ బదరీం ప్రాప యత్ర విష్ణుస్తపస్యతి. (VIII-37,38)**
**నిస్తమస్తమివాదిత్యం భాస్వన్తమివ పావకం,**
**గోవిందభగవత్పాదదేశికేంద్రం అలక్షయత్. (VIII-46)**

శంకరులు తూర్పున ఉన్న జగన్నాథ (పూరి) క్షేత్రాన్ని చేరుకోవడాన్ని చిద్విలాసుడు వివరించాడు:

**శ్లో ॥ జగన్నాథమథ ప్రాప దీనానాథాన్ సనాథయన్,**
**సాక్షాత్ విసృజ్య వైకుంఠం యత్రైవోత్కంఠతే హరిః.**
**మహోదధిర్యత్ర తీర్థం జగన్నాథపురోభువి,**
**ద్వారకావాసినో విష్ణోః తనురద్యాపి వర్తతే. (XXX-6,7)**

మహాలక్ష్మితో ప్రకాశిస్తూ మహావిష్ణువు కొలువై ఉన్న పశ్చిమ అంచుల్లోని ద్వారకను ఆచార్యులు పర్యటించడం, అక్కడ ఒక నెల రోజులపాటు శంకరులవారు నివసించడం గురించి ఈ జీవితచరిత్రలో ఇలా చెప్పారు:

**శ్లో ॥ తతో ద్వారవతీమ్ ప్రాప దేశికాధీశ్వరః స్వయం,**
**యాత్రాస్తే స మహావిష్ణుః సాక్షాత్ లక్ష్మ్యా సమన్వితః.**
**మాసమేకం వసన్ తత్ర పర్యటన్ అభితో భృశం. (XXX-3,7)**

దక్షిణ ధామమైన రామేశ్వరంలో శంకరులవారి బస గురించి చిద్విలాసుని గ్రంథంలోని శ్లోకాలు ఈ విధంగా ఉన్నాయి:

శ్లో ॥ తతః శ్రీ దేశికేన్ద్రో అసౌ గత్వా రామేశ్వరస్థలం,
స్నాత్వా మహోదధౌ రమ్యే భక్త్యా రత్నాకరే అన్వహం.
తత్రత్యాని సుతీర్థాని దివ్యాన్యపి విలోకయన్,
ఉటజాని విచిత్రాణి విలోక్యానందముద్వహన్.
స్వేనానీతం వీవధస్థం గాంగం పాథః సముజ్జ్వలం,
అభిషిచ్య మహాభక్త్యా రామేశస్యోపరి స్వయం,
పూజయామాస తం దేవం బిల్వపత్రైః స కోమలైః. (XXVII 1 to 5)

(పైన పేర్కొన్న శ్లోకాలు ఆచార్యులు రామేశ్వరానికి విచ్చేయడం, మహోదధి, రత్నాకర (బంగాళాఖాతం, అరేబియా మహాసముద్రం)లో స్నానమాచరించడం, వివిధ పవిత్ర నదీజలాలు, ఆ ప్రాంతంలోని ఆవవాసాలపై ఆయన దృష్టిపడటం, ఉత్తరం నుంచి తీసుకువచ్చిన గంగాజలంతో, గొప్ప భక్తితో శ్రీరామనాథునికి అభిషేకం చేయడం, అనంతరం బిల్వ దళాలతో అర్చన చేయడాన్ని గురించి కూడా చెప్తాయి).

తన దిగ్విజయ యాత్రలో భాగంగా దేశ సంప్రదాయ మూలాలైన నాలుగు ధామాలను శంకరులు సందర్శించడం, దక్షిణపు అంచుల్లో ఉన్న రామేశ్వరాన్ని చేరుకొని, పవిత్ర గంగాజలం, కమలాలతో శ్రీ రామనాథుని అర్చించడం, ఆయన ఆ ప్రదేశంలో రెండు నెలల పాటు బస చేయడం తదితర విషయాలను ఈ విధంగా చెప్పారు.

శ్లో ॥ రామేశ్వరం రామకృతప్రతిష్ఠం కామేశ్వరీభూషితవామభాగం,
మాహేంద్ర నీలజ్వలదుత్కిరీటం రామేశ్వరం త్వామిహ పూజయామి.
ఇతి గంగాజలైః శుద్ధైః అర్చయామాస శంకరం,
శంకరః పంకజైః పుష్పైః అన్యవన్యఫలైః తథా.
ఏవం మహాదేవం అర్చయిత్వా మాసద్వయం తత్ర సుఖమువాస. (ప్రకరణం-4)

ఉత్తరంలోని బదరీ, పశ్చిమంలోని ద్వారక, తూర్పున ఉనన్న జగన్నాథ పూరిలకు ఆచార్యుల వారి యాత్రను గురించి గ్రంథంలోని 56వ ప్రకరణంలో పేర్కొనడం జరిగింది.

మధ్యభారతదేశంలోని మోక్షపురి అయిన ఉజ్జయనిలో మహాకాళేశ్వరుడు, భగవతి మహాచండిలను శంకరులు పూజించడం అన్నది చిద్విలాసుడు, ఆనందగిరి ఇద్దరూ తాము రచించిన జీవితచరిత్రలో పేర్కొన్నారు.

దక్షిణ మోక్షపురి అయిన కంచిని శంకరులు పర్యటించి, బస చేయడం గురించి దాదాపు అన్ని జీవితచరిత్రలు, ఆచార్యుని జీవిత గాథను వివరించే రచనలు స్పష్టంగా పేర్కొన్నాయి.



# మూకపంచశతి ఆర్యాశతకం

- బాలాత్రిపురసుందరి చిర్రావూరి

శ్లో ॥ ఆమ్రతరుమూలవసతేరాదిమపురుషస్య నయనపీయూషమ్ ॥
ఆరబ్ధయౌవనోత్సవమామ్నాయరహస్యమన్తరవలమ్బే ॥ 13 ॥

**తాత్పర్యం:-** మామిడిచెట్టు యొక్క మూలమును నివాసస్థానముగా గల ఆదిపురుషుడైన శివుని నేత్రములకు అమృతమైన, యౌవనోత్సవమును ప్రారంభించిన, వేదములయొక్క రహస్యమైన ఆ తల్లిని నా మనస్సులో పట్టుకొందును.

**బాలమనోజ్ఞ:-** కంచి లో ఉన్న స్వామి ఏకామ్రేశ్వరుడు. సాధారణంగా మనం అనుకునేది -అక్కడ ఉన్న మామిడి చెట్టు ఒకే కాయ కాస్తుంది కాబట్టి అది ఏకామ్రవృక్షమనీ దాని మూలమందున్నవాడు కనుక ఏకామ్రేశ్వరుడనీ. మామిడి చెట్టు మొదటిలోనే ఈశ్వరుడు ఎందుకున్నాడనే దానికి మూకపంచశతీ వ్యాఖ్యానం వ్రాసిన శ్రీ దోర్బల విశ్వనాథశర్మగారు చమత్కారంగా వ్రాశారు. దానిని నా మాటలలో ఇక్కడ వ్రాస్తున్నాను. ఆ(మ్ర) అని తీసుకుని 'మ్ర' అనే అక్షరాన్ని విడదీస్తే 'మ ర'. దీనిని మరల మరల అనగా 'ర' దీర్ఘమౌతుంది. 'రామ' అని కూడా వినబడుతుంది. ఇదే కదా! మహర్షులు వాల్మీకికి ఉపదేశం చేసినది. ఆయన మరా, మరా... అని అనగా అనగా రామ ఐంది. శివుడు ఎప్పుడూ కూడా రామనామాన్ని ధ్యానిస్తాడని మనకు పురాణాలు చెప్తున్నాయి. అలాగే 'రామా' అంటే ఆ తల్లి కూడాను. (రక్షాకరీ రాక్షసఘ్నీ రామా రమణలంపటా- లలితా సహస్రనామ స్తోత్రము) అలాగే "శ్రీకృష్ణఃశ్యామలా దేవీ శ్రీరామో లలితాంబికా "అని ఋషి వచనం. రామునికి, రామునిలో ఉన్న శక్తికి బేధం లేదు. ఆమ్రవృక్షమూలమునందు ఉన్న ఆది పురుషుడైన


ఈశ్వరుని కన్నులకు అమృతపు విందు చేస్తూంటూందిట ఆ తల్లి. "రాకాచంద్రసమానకాంతివదన" చంద్రకాంతిని బోలు ఆ తల్లి ముఖము నుండి వచ్చే అమృతమును త్రాగుతున్నాయట ఆ స్వామి కన్నులు. పైగా ఆ కామాక్షి ప్రౌఢ కాదు . అప్పుడే యౌవనంలోనికి అడుగిడుతోందిట. వేదములయొక్క రహస్యాలన్నీ ఈమెలోనే ఉన్నాయి. వేదాలన్నీ ఈ తల్లిని తమలో రహస్యంగా ఇముడ్చుకున్నాయిట. అటువంటి ఆ తల్లిని నేను నా మనస్సుతో పట్టుకుంటాను. ఆ తల్లి గనుక నా మనస్సనే మందిరంలో ఉంటే ఈశ్వరుని అనుగ్రహము, వేదార్థజ్ఞానాన్ని పొందగలను.

**శ్లో ॥ అధికాంచిపరమయోగిభిరాదిమపరపీఠసీమ్ని దృశ్యేన ॥**
**అనుబద్ధం మమ మానసమరుణిమసర్వస్వసంప్రదాయేన ॥ 14 ॥**

**తాత్పర్యం:–** కాంచీనగరమునందున్న, మొదటివాడును శ్రేష్ఠుదును యైన పరమశివుడను పీఠప్రదేశమున ఉండి, పరమయోగులచే చూడబడుతున్న, సంపూర్ణమైన అరుణిమ సంప్రదాయ సర్వస్వముతో నాకు అనుబంధము ఏర్పడియున్నది.

**బాలమనోజ్ఞ:–** ఆ తల్లి కాంచీనగరికి అధిష్ఠాత్రి. ఆదిమపురుషుడు, శ్రేష్ఠుడూ ఐన పరమశివుడే ఆవిడ కూర్చున్న పీఠప్రదేశమట. "శివాకారే మంచే పరమశివపర్యంకనిలయాం" అని సౌందర్యలహరిలో శంకరులవారు వర్ణిస్తారు. బ్రహ్మవిష్ణురుద్ర ఈశ్వరులు ఆవిడ పీఠానికి నాలుగు కోళ్లుగా ఐదవవాడైన పరమశివుడు పీఠముగా ఉన్నారని వారినే పంచప్రేతలని, పంచబ్రహ్మలని కూడా అంటారని లలితాసహస్రనామస్తోత్రం– "పంచప్రేతాసనాసీనా పంచబ్రహ్మస్వరూపిణీ". అటువంటి ఆ తల్లిని మహాయోగులు తప్ప దర్శించలేరు. అటువంటి వారికి దర్శనమిచ్చే ఆ కామాక్షిని నేను నా పూర్వజన్మ విశేషముచేత దర్శిస్తున్నాను. అరుణిమవర్ణము అనగా ఎఱ్ఱటిఎరుపుతో ప్రకాశించే ఆ తల్లితో అరుణిమసంప్రదాయము చేత అనుబంధమేర్పడినది.

# శ్రీ సద్గురు దశకం



శ్లో ॥ శృతి స్మృతి పురాణోక్త ధర్మ మార్గ రతం గురుం,
భక్తానాం హితవక్తారం నమస్యే చిత్తశుద్ధయే.

వేదాలలో, ఉపనిషత్తులలో, పురాణాలలో, ఇతిహాసాలలో బోధింపబడిన సనాతన వైదిక ధర్మ మార్గములో ఎల్లప్పుడూ నడిచి, భక్తులందరికీ మంచి మాటలతో ధర్మోపదేశాలు అందించిన భగవత్స్వరూపులను అంతఃశద్ధి కొరకై నమస్కరించుచున్నాను.

శ్లో ॥ అద్వైతానందభరితం సాధూనాం ఉపకారిణం,
సర్వశాస్త్రవిదం శాంతం నమస్యే చిత్తశుద్ధయే.

వేదాంత తత్త్వ అనుభూతి తో నిండి, సజ్జనులకు, సాధువులకు ఎల్లప్పుడూ రక్షణ, పోషణ కల్పించి, సకల శాస్త్రవేత్తగా, శాంతిమూర్తులై వర్ధిల్లిన గురువర్యులకు అభివందనము.

శ్లో ॥ కర్మ భక్తి జ్ఞాన మార్గ ప్రచారే బద్ధ కంకణం,
అనుగ్రహ ప్రదాతారం నమస్యే చిత్తశుద్ధయే.

కర్మ మార్గము, భక్తి మార్గము, జ్ఞాన మార్గము అనే మూడింటిని ప్రచారం చెయ్యాలనే దృఢ సంకల్పంతో భక్తులందరినీ అనుగ్రహిస్తున్న దీక్షాబద్ధులైన గురుమూర్తికి వందనము.

**శ్లో ॥ భగవత్పాద-పాదాబ్జ-వినివేశిత చేతసః,**
**శ్రీచంద్రశేఖరగురోః ప్రసాదో మయి జాయతాం.**

ఆది శంకర భగవత్పాదుల దివ్యచరణారవిందములయందు తమ మనస్సును అంకితం చేసిన శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి గురువర్యుల కటాక్షము నామీద కలుగు గాక!

**శ్లో ॥ క్షేత్ర-తీర్థ-కథాభిజ్ఞః సచ్చిదానంద విగ్రహః,**
**చంద్రశేఖరవర్యో మే సన్నిధత్తామ్ సదా హృది.**

స్థలచరిత్రలన్నీ తెలిసిన మహానుభావులు, పరిపూర్ణ అద్వైత తత్త్వానుభూతి పొందిన యోగి, శ్రీ చంద్రశేఖర గురువర్యులు హృదయమునందు ఎల్లప్పుడూ నిలిచి ఉందురు గాక!

**శ్లో ॥ పోషణే వేదశాస్త్రాణాం దత్తచిత్తమహర్నిశం,**
**క్షేత్రయాత్రారతం వందే సద్గురుం చంద్రశేఖరమ్.**

భారతదేశంలో యాత్రలు చేస్తూ ఎల్లప్పుడూ వేదశాస్త్ర పరిరక్షణ కోసం ప్రయత్నిస్తున్న సద్గురువులకు అభివందనము.

**శ్లో ॥ వేదజ్ఞాన్ వేదభాష్యజ్ఞాన్ కర్తుం యస్య సముద్యమః,**
**గురుర్యస్య మహాదేవః తమ్ వందే చంద్రశేఖరం.**

వేదము నేర్చుకున్నవారిని వేదభాష్యము కూడా నేర్చుకొమ్మని ప్రోత్సహించి, నేర్చుకునే ఏర్పాటు ను కూడా కల్పించేటి గురువులకు, శ్రీ మహాదేవేంద్ర సరస్వతి యతీంద్రుల శిష్యులైన శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామివారికి వందనములు.

**శ్లో ॥ మణివాచక-గోదాది భక్తివాగమృతైర్భృశమ్,**
**బాలానాం భగవద్భక్తిమ్ వర్ధయన్తం గురుం భజే.**

మంచి మాటలతోనూ, సూక్తులతోనూ, దివ్య అనుగ్రహ భాషణము తోనూ చిన్న పిల్లల్లో కూడా భగవద్భకితిని పెంపొందించే గురువర్యులకు అభివందనము.

**శ్లో ॥ లఘూపదేశైర్నాస్తిక్య-భావమర్దన-కోవిదమ్,**
**శివం స్మితముఖం శాంతం ప్రణతోస్మి జగద్గురుమ్.**

సరళమైన ఉపదేశాలతో ఆస్తిక్యాన్ని పెంపొందించి, నాస్తిక భావాన్ని ఆమూలాము తొలగింపగల నిపుణులు, మందస్మితముతో శివస్వరూపులుగా శాంతమూర్తులుగా వర్ధిల్లుతున్న జగద్గురువులకు ప్రణామము.

**శ్లో ॥ వినయేన ప్రార్థయే అహం విద్యామ్ బోధయ మే గురో,**
**మార్గమన్యం న జానే అహం భవన్తం శరణం గతః.**

గురువర్య! మార్గము తెలియని దిగ్భ్రమలో మిమ్ము శరణుకోరి వచ్చిన నన్ను కాపాడి, విద్యను మార్గమును బోధింపమని ప్రార్థిస్తున్నాను!

ఇట్లు శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి శంకరాచార్య స్వామివారు రచించిన సద్గురు దశకం సంపూర్ణము. *

JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA

2


॥श्रीगुरुभ्यो नमः ॥

॥श्रीचन्द्रमौलीश्वराय नमः ॥

||Sri Chandramouleeswaraya Namaha||

**SHRI KANCHI KAMAKOTI PEETAM**

**JAGADGURU SRI SHANKARACHARYA SWAMIGAL SHRIMATAM SAMSTHANAM**



# Visesha Pujas at Shirmatam in May 2023

| | |
|---|---|
| 3rd May, Wed. | Pradosha Puja |
| 4th May, Thu. | Nrisimha Jayanthi |
| 5th May, Fri. | Pournami Puja |
| 17th May, Wed. | Pradosha Puja |
| Rathotsavams | 7th-Anusham, 9th-Moolam, 12th- Avittam, 10th-Uthradam |
| Shukravara Puja | 5th, 12th, 19th, 26th |

**శ్రీ మఠం శిబిరం ప్రస్తుతం తిరుపతిలో శ్రీ కంచి కామకోటి పీఠం పాదుకా మండపం, రామకృష్ణ మార్గ్, వినాయక్ నగర్, అలిపిరి దగ్గర ఉంది. మే 22, 2023 వరకు తిరుపతిలో కొనసాగుతుంది.**

JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA

JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA

SRI CHANDRAMOULEESWARAYA NAMAHA



## SHRI KANCHI KAMAKOTI PEETAM
### JAGADGURU SHANKARACHARYA SWAMIGAL
### SHRIMATAM SAMSTHANAM

1, SALAI STREET, KANCHIPURAM, TAMILNADU - 631502 INDIA

**www.kamakoti.org**

**fb.me/srikamakoti**

**youtube.com/kanchimath**

**twitter.com/kanchimatham**

**instagram.com/kanchimutt**

Koo

**koo @kamakoti**

**www.kamakoti.tv**

**www.kanchimuttseva.org**

# ESEVA PORTAL

for Online Puja Bookings & Contributions

JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA



శ్లో ॥ వినయేన ప్రార్థయే అహం విద్యామ్ బోధయ మే గురో,
మార్గమన్యం న జానే అహం భవన్తం శరణం గతః.

గురువర్య! మార్గము తెలియని దిగ్భ్రమలో మిమ్ము శరణుకోరి వచ్చిన నన్ను కాపాడి,
విద్యను మార్గమును బోధింపమని ప్రార్థిస్తున్నాను!